### విలేఖరులు కావలెను

ప్రజాపక్షమే లక్ష్యంగా సీనియర్ జర్నలిస్టు మేడే శాంతికుమార్ సారథ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వెలువడుతున్న ధర్మఘంట తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో అన్ని జిల్లాలకు జిల్లా ప్రతినిధులు, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, మండల విలేఖరులు కావలెను. ఆసక్తి గల వారు తమ బయోడేటాను ఈక్రింది చిరునామాకు పంపించగలరు..

స్ఫూర్తి పబ్లికేషన్స్, నెం: 7-8-94/2, శ్రీనగర్ కాలనీ, పానగల్ రోడ్డు, నల్లగొండ-508001. ఫోన్ నెం: 9885826108.
E-mail: shanthimama@gmail.com



ప్రజల కోసం - ప్రకృతి కోసం - సామాన్యుని గొంతుగా - సామాజిక సమరంగా స్ఫూర్తి పబ్లికేషన్స్ వారి

# ధర్మఘంట

తెలుగు జాతీయ దిన పత్రిక

TELTEL/2012/47103

సంపుటి : 12 సంచిక :110 నల్గొండ | గురువారం 17-07-2025 ఎడిటర్ : మేడే శాంతికుమార్ | పేజీలు : 4 వెల : రూ.1/-


## సీఎంల భేటీ.. తెలంగాణ 10 ప్రతిపాదనలు ఇవే..



న్యూఢిల్లీ,కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు తెలుగు రాష్ట్రాల సీఎంలు రేవంత్ రెడ్డి, చంద్రబాబు మీటింగ్ కొద్దిసేపటి క్రితమే ప్రారంభం అయింది. ఈ మీటింగ్ లో ఏపీ పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్ట్ ను ప్రతిపాదించింది. తెలంగాణ మాత్రం పది అంశాలను ప్రతిపాదించింది. ఇందులో చూసుకుంటే 1.పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, డిండి ఎత్తిపోతల పథకానికి అనుమతులు ఇవ్వాలి. 2. శ్రీశైలం నుంచి వేరే బేసిన్ కి నీటి తరలింపు పనులను వెంటనే ఆపేయాలి. 3. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గా ఉన్నప్పుడు తెలంగాణ లో ప్రారంభించిన ప్రాజెక్టులు పూర్తయ్యేలా ఏపీ సహకరించాలి. అలాగే కృష్ణ ట్రిబ్యునల్ లో తెలంగాణ వాదనలకు మద్దతుగా ఏపీని కేంద్రం ఒప్పించాలి. 4. కృష్ణానది జలాలను వేరే బేసిన్ కు తరలించకుండా "కృష్ణా రివర్ మేనేజ్మెంట్ బోర్డు" చర్యలు తీసుకునేలా ఆదేశించాలి. దీంతో పాటు కృష్ణా జలాల అక్రమ తరలింపును అడ్డుకునేందుకు టెలిమెట్రీలను ఏర్పాటు చేసేందుకు ఏపీ ఒప్పుకోవాలి. 5.తుంగభద్ర బోర్డు నీటి తరలింపుపై చర్చించాలి. 6.రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పథకంపై ఎన్జీటీ ఉత్తర్వులను అమలు చేసే విధంగా కేంద్ర జలశక్తి శాఖ చర్యలు తీసుకోవాలి. ఆ మేరకు పునరుద్ధరణ జరపాలి. ఈ పథకంపై చట్టపరంగానే ముందుకు వెళ్లాలి. 7. శ్రీశైలం కుడి కాలువ ద్వారా ఎక్కువ నీటి తరలింపును నియంత్రించాలి. 8. శ్రీశైలం ప్రాజెక్టులో కొత్త ప్రాజెక్టులు హంద్రీనీవా, వెలిగొండ, గురు రాఘవేంద్ర నిర్మాణాలను నియంత్రించాలి. 9.శ్రీశైలం డ్యాం సేఫ్టీకి తగిన చర్యలు తీసుకోవాలి.10. అక్రమంగా శ్రీశైలం నుంచి నీటి తరలింపు ద్వారా విద్యుత్ ఉత్పత్తికి తీవ్ర విఘాతం కలుగుతుంది దీనిని అడ్డుకోవాలి. 11. పోలవరం ప్రాజెక్టు తరహాలోనే ఇచ్చంపల్లి ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వాలి. ఇచ్చంపల్లి నుంచి కావేరికి గోదావరి జలాల తరలింపునకు తెలంగాణ సిద్ధం. అందులో 200 టీఎంసీల నీటిని వాడుకునేందుకు అనుమతులు ఇవ్వాలి. సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వాలి. "ప్రాణహిత-చేవెళ్ల సుజల స్రవంతి" ప్రాజెక్టుకు ఏఐబిపి కింద నిధులు ఇవ్వాలి. మహారాష్ట్ర ప్రభుత్వంతో కేంద్ర ప్రభుత్వమే చర్చలు జరిపి తుమ్మిడి హట్టి వద్ద బ్యారేజ్ నిర్మాణానికి సహకరించాలి అంటూ ఈ సమావేశంలో తెలంగాణ ప్రతిపాదనలు పెట్టింది. వీటిపై చర్చలు జరిపే అవకాశాలు ఉన్నాయి.

## బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బెంగాలీ మాట్లాడే వారిపై వేధింపులు..

న్యూఢిల్లీ,2026 ఎన్నికలలో దూకుడు మీదున్న బీజేపీని ఎదుర్కోవడానికి బెంగాలీల ఆత్మగౌరవం అనే భావోద్వేగ అంశాన్ని టీఎంసీ మళ్లీ రగిలించాలని యోచిస్తోంది. ఈ నేపథ్యంలో ఆయా రాష్ట్రాల్లోని బీజేపీ ప్రభుత్వాలు బెంగాల్ కి చెందిన పౌరులను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నాయని టీఎంసీ ఆరోపించింది. ఇందులో భాగంగానే, కమలం పార్టీకి వ్యతిరేకంగా వర్షం కురిసినప్పటికీ కోల్‌కతా నడిబొడ్డున సుమారు 3 కిలోమీటర్ల పొడవునా భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి, టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీతో సహా అధికార తృణమూల్ కాంగ్రెస్ అగ్ర నాయకులందరూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మమతా బెనర్జీ మాట్లాడుతూ.. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బెంగాలీ మాట్లాడే ప్రజలను వేధిస్తున్నారని ఆరోపణలు గుప్పించింది. అలాగే, బెంగాలీ ప్రజల పట్ల ఆ రాష్ట్రాలు చేస్తున్న దౌర్జన్యాలపై సిగ్గుపడాలి అని మండిపడింది.అయితే, ఒడిశాలోని ఝార్సుగూడలో 444 మంది అనుమానిత బంగ్లాదేశ్ జాతీయులను ఇటీవల అదుపులోకి తీసుకోవడంతో తీవ్ర నిరసనకు దారి తీసింది. వారిలో 200 మంది బెంగాల్ నుంచి వలస వచ్చిన కార్మికులు ఉన్నారని తృణమూల్ కాంగ్రెస్ పేర్కొంది.



అలాగే, ఢిల్లీలో కూడా బెంగాల్ వాసుల బహిష్కరణ డ్రైవ్‌లు కొనసాగుతున్నట్లు పలు నివేదికలు బయటకు వస్తున్నాయని బీజేపీపై టీఎంసీ తీవ్రమైన ఆరోపణలు చేసింది. వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో త్వరలోనే పశ్చిమ బెంగాల్ లో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పర్యటించనున్నారు. దీంతో బీజేపీ ఆధ్వర్యంలోని పలు రాష్ట్రాల్లో బెంగాల్ పౌరులపై వేధింపుల అంశాన్ని తెర పైకి తీసుకొచ్చింది తృణమూల్ కాంగ్రెస్ పార్టీ.

## గుమ్మడిదల రైతులకు అండగా ఉంటాం

గుమ్మడిదల,మండల కేంద్రంలోని 109 సర్వే నంబర్ అసైన్డ్ భూములను కోల్పోతున్న రైతులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు భూబాధితులకు హామీ ఇచ్చారు. గుమ్మడిదలలోని 157 ఎకరాల అసైన్డ్ భూమిని ఇండస్ట్రియల్ పార్కు కోసం రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. దీనికోసం జిల్లా, మండల రెవెన్యూ అధికారులు రైతుల జాబితాను సిద్ధం చేశారు. గతంలో ఆర్‌డీవో, తహసిల్దార్ పర్యవేక్షణలో క్షేత్రస్థాయిలో రైతుల అభిప్రాయాన్ని సేకరించారు. రైతులకు న్యాయపరంగా రావలిసిన పరిహారాన్ని ఇప్పిస్తామని హామీ ఇచ్చారు.కాగా ఇటీవల భూములు కోల్పోతున్న రైతులకు ఎకరానికి రూ. 15 లక్షలు ఇస్తామని అధికారుల నుంచి సమాచారం రావడంతో రైతులు మండిపడుతున్నారు. హైదరాబాద్‌కు కూతవేటు దూరంలో ఉన్న గుమ్మడిదల మండలంలో భూములకు మంచి ఖరీదు ఉందని ఎకరానికి సుమారుగా రూ.4 నుంచి 5 కోట్ల రూపాయాలు పలుకుతున్న భూములకు రూ.15 లక్షలు, ఇండ్ల స్థలానికి మూడు వందల గజాల భూమిని ఇస్తామని అధికారులు అంటున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి గుమ్మడిదల రైతులతో బుధవారం హైదరాబాద్‌లో మాజీ మంత్రి హరీష్‌రావును కలిసి వివరించారు. అంతే కాకుండా ఈ భూముల్లో గత కొన్ని దశాబ్దాలుగా రైతుల వినియోగంలో ఉన్నప్పటికి, రెవెన్యూ రికార్డులో నమోదు



కాలేదని, ప్రభుత్వం సేపట్టిన భూసేకరణలో వారికి అన్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ అంశంపై స్పందించిన మాజీ మంత్రి హరీష్‌రావు సంబంధిత అధికారులతో పూర్తి స్థాయిలో చర్చించి సమస్యకు తగిన పరిష్కారం తీసుకరావడానికి కృషి చేస్తానని తెలిపారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వీరితో పాటు జిన్నారం మండల పార్టీ అధ్యక్షుడు రాజేశ్, నాకులు చంద్రారెడ్డి, సూర్యనారాయణ, ఆంజనేయులు యాదవ్ తదితరులు ఉన్నారు.

## దసరా నాటికి ఉప్పల్ ఫ్లై ఓవర్ పూర్తి



హైదరాబాద్,ఉప్పల్ రింగ్ రోడ్డు నుంచి నారపల్లి వరకు 8 కిలోమీటర్ల మేరకు నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. వచ్చే దసరా నాటికి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బుధవారం ప్రభుత్వం విఫ్ బీర్ల ఐలయ్య, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తో కలిసి వంతెన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. యాదగిరిగుట్ట భువనగిరి వరంగల్ జాతీయ రహదారిపై దాదాపు 8 సంవత్సరాల క్రితం ప్రారంభించిన పనులు ఆర్థిక వనరులు, ఇతర కారణాల వల్ల తీవ్ర జాప్యం జరిగిందన్నారు. తమ ప్రభుత్వం రాగానే ఈ పనులపై ప్రత్యేక దృష్టి సారించి కేంద్ర మంత్రి నితిన్ గట్కారీతో సైతం చర్చలు జరిపి పనుల్లో వేగం పెంచామన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి మొన్నటి వరకు పనులు నిర్వహించిన కాంట్రాక్టర్ను సైతం మార్చి కొత్తవారికి పనులు అప్పగించామని కోమటిరెడ్డి వివరించారు. ప్రత్యేక శ్రద్ధతో పనుల్లో వేగాన్ని పెంచి పరితగతిన పూర్తి చేస్తామని వెల్లడించారు. నగరంలో పివి ఎక్స్‌ప్రెస్ హైవే తర్వాత అతిపెద్ద ఫ్లైఓవర్ గా పేరున్నదని స్పష్టం చేశారు. వచ్చే దసరా నాటికి పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటు-లోకి తీసుకొస్తామని మంత్రి తెలియజేశారు. నిర్మాణ పనులు అర్ధంతరంగా ఆపేయడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. గుంతల రోడ్డుపై అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కొన్ని కారణాల వల్ల కారిడార్ పనులు పూర్తి కాలేదని, ఈ విషయంలో ఎవరినీ తప్పు పట్టాల్సిన అవసరం లేదన్నారు. తొలుత నిర్మాణ పనులు చేపట్టిన గాయత్రీ సంస్థ తప్పుకోవడంతో పనులను మరో సంస్థకు అప్పగించామన్నారు. త్వరగా నిర్మాణ పనులు పూర్తి చేసి దసరా నాటికి అందుబాటు-లోకి తీసుకొస్తామని మంత్రి తెలిపారు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



మైలార్‌దేవ్‌పల్లి : ప్రజా అవసరాలను తీర్చేందుకు కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులను చేపడుతున్నామని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి ప్రకాశ్‌గౌడ్ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ వట్టెపల్లి ప్రాంతంలో జీహెచ్‌ఎంసీ ప్రాజెక్ట్ వారి ఆధ్వర్యంలో 71 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు, రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులను బుధవారం అధికారులతో కలిసి ఆయన పర్యవేక్షించారు.పనుల పురోగతిని, నాణ్యతను స్వయంగా పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఈ సీసీ రోడ్డు, రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయితే మైలార్‌దేవ్‌పల్లి నుంచి శాస్త్రీపురం, వట్టెపల్లి వెళ్లే ప్రజలకు ప్రయాణ దూరం గణనీయంగా తగ్గుతుందన్నారు. ఇది నియోజకవర్గ ప్రజల చిరకాల స్వప్నం అన్నారు. ట్రాఫిక్ సమస్యలను తగ్గించి ప్రజలకు సులువైన, వేగవంతమైన ప్రయాణాన్ని అందిచడమే తమ లక్ష్యమని చెప్పారు. ఈ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తుందని చెప్పారు. పనులను వేగవంతం చేయాలని, నాణ్యతా ప్రమాణాలను పాటించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఈఈ శ్రీనివాస్, డీఈ కార్తీక్, రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్, ఈఈ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్లు బీజేపీకి ఇష్టం లేదు..

హైదరాబాద్,బీజేపీపై మంత్రి సీతక్క హాట్ కామెంట్స్ చేశారు. తాము బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు తీసుకొస్తుంటే బీజేపీ జీర్ణించుకోలేకపోతోందన్నారు. బీసీల రిజర్వేషన్లకు బీజేపీ ఎప్పుడూ వ్యతిరేకమే అని ఫైర్ అయ్యారు.బీసీల సాధికారత కోసం కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. ఎట్టి పరిస్థితుల్లో బీసీలకు రిజర్వేషన్లు రావాలన్నారు మంత్రి సీతక్క. ఈ సందర్భంగా తన శాఖ పరిధిలోని అంశాలపై, ఇతర ప్రభుత్వ పథకాలపై మాట్లాడారు. బడి పిల్లల యూనిఫార్మ్ ల ద్వారా మహిళ సంఘాలకు 30 కోట్లు ఆదాయం వచ్చిందని తెలిపారు సీతక్క. తమ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమే కాకుండా ఆ బస్సులకు ఓనర్లను కూడా చేస్తోందన్నారు. అంబానీ లాంటి కోటీశ్వర్లు నడిపే సోలార్ ప్లాంట్లు కూడా మహిళ సంఘాలకు ఇస్తున్నామని వివరించారు.మా పాలనలో 26 వేల కోట్లు రుణాలు ఇచ్చాం. మహిళ సంఘాల నుంచి 98 శాతం లోన్లు రిపేమెంట్ చేసారు. బ్యాంకర్లు లోన్లు ఇవ్వడానికి ముందుకు వస్తున్నారు. అద్దె బస్సులను ప్రభుత్వం ష్యూరిటీ మీద తెచ్చి మహిళలకు ఇస్తుంది. అనేక కష్టాలు పడ్డ మహిళా సంఘాలు ఈరోజు కోట్లాది రూపాయల సంపాదించే స్థాయికి చేరాయి. ఆడవాళ్లు కలిసి ఉండరు అనే సామెతలు ఉన్న చోట 67 లక్షల మంది సంఘాల్లో ఐక్యంగా ఉంది శక్తిని చాటుతున్నారు. మహిళా సంఘం



సభ్యురాలు ప్రమాదవశాత్తు చనిపోతే 10 లక్షలు ఎక్స్ గ్రేషియో ఇస్తున్నాం. మహిళా సంఘాల వాళ్ళకి రెండు చీరలు ఇస్తున్నాం.. నాణ్యమైన చీర ఇస్తాం. బొంబాయి, సూరత్ నుంచి చీరలు తేవడం లేదు. అటవీ ఉత్పత్తులను మహిళా సంఘాల ద్వారా ప్రోత్సహిస్తున్నాం. తెలంగాణ మహిళా సంఘాల కృషిని ప్రధాని మన్ కీ బాత్ లో నాలుగైదు సార్లు పొగిడారు అంటూ మంత్రి సీతక్క చెప్పుకొచ్చారు

## మేడిగడ్డమీద కూర్చుని చర్చిద్దాం.. రేవంత్ కు కేటీఆర్ సవాల్..

హైదరాబాద్,రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి కేటీఆర్ సవాల్ విసిరారు. సీఎం రేవంత్ రెడ్డి పదే పదే మేడిగడ్డ బరాజ్ కూలిందంటున్నారు.. దమ్ముంటే అదే మేడిగడ్డ మీద కూర్చుని చర్చపెడుదాం వస్తావా అంటూ సవాల్ విసిరారు మాజీ మంత్రి కేటీఆర్.తెలంగాణ భవన్ లో బుధవారం జరిగిన దళిత బంధు సాధన సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మధ్య సీఎం రేవంత్ రెడ్డి తన తప్పులను కప్పి పుచ్చుకోవడానికి పదే పదే మేడిగడ్డ కూలిందంటున్నాడు. ఆయన ఆరోపణలకు మేం క్లారిటీ ఇస్తాం. రేవంత్ రెడ్డి కూలిందంటున్న మేడిగడ్డ బరాజ్ మీదకే చర్చకు రావాలి. దమ్ముంటే రేవంత్ మేము విసిరిన సవాల్ స్వీకరించాలి. మమ్మల్ని చర్చకు రావాలంటూ పారిపోయిన పిరికి వ్యక్తి రేవంత్ రెడ్డి అన్నారు కేటీఆర్.నాగార్జునసాగర్ కట్టపైన చర్చకు వస్తావా అని రేవంత్ రెడ్డి సవాల్ విసురుతున్నారు. నాగార్జున సాగర్ మీద కాదు.. ముందు మేడిగడ్డ బ్యారేజ్ మీద చర్చకు రావాలి. ఇప్పటికే మా సీనియర్ నాయకులు మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి మేడిగడ్డ బరాజ్ వద్దకు వెళ్లి వచ్చి మరి సవాల్ విసిరిండు. తుంగతుర్తి సూర్యాపేట నియోజకవర్గం చివరి మడి వరకు నీరు ఇచ్చిన



నాయకుడు కేసీఆర్ అని రేవంత్ కు తెలుసు. అయినా కూడా రేవంత్ రెడ్డి అబద్దాలు మాట్లాతున్నాడు. ఆయన పదే పదే తన దగ్గర బడ్జెట్ లేదని తప్పించుకుంటున్నాడు. ఏమైనా అంటే నన్ను కోసుకుని తింటారా అంటున్నాడు. రానున్న స్థానిక సంస్థల్లో ప్రజలు సరైన బుద్ధి చెప్తారు అంటూ చెప్పారు కేటీఆర్.

## గోషామహల్‌లో ఉప ఎన్నిక వస్తే బీజేపీ నుంచి మాధవీలత పోటీ చేస్తారా?

హైదరాబాద్,బీజేపీకి గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామా చేయడంతో శాసనసభ సభ్యత్వానికి కూడా రిజైన్ చేస్తారన్న ప్రచారం జరుగుతోంది. దీంతో ఆ స్థానంలో బీజేపీ ఎవరిని దింపుతుందన్న ఉత్కంఠ నెలకొంది. బీజేపీ నాయకురాలు మాధవీలతను దింపే అవకాశం కూడా ఉందని ఊహాగానాలు వస్తున్నాయి.దీనిపై మాధవీలత స్పందించారు. ఆమె మాట్లాడుతూ.. "బై ఎలక్షన్స్ ఎలా వస్తాయి? రాజాసింగ్ కూర్చున్న కొమ్మను ఇరగగొట్టుకుంటారని మీరు అనుకుంటున్నారా? స్పీకర్ కి రాజీనామా లేఖను ఇస్తారని అనుకుంటున్నారా?ఒకవేళ కాన్స్టిట్యూషనల్ పవర్స్ ని దృష్టిలో పెట్టుకుని మా వాళ్లు ఏమన్నా సాధిస్తే.. లెట్స్ సీ దట్.. ఎందుకంటే మీకు ఓపెన్ చెబుతున్నాను. చిన్నతనం నుంచి నా మనస్తత్వం విభిన్నంగా ఉంది. ఎంత రెవల్యూషనిస్ట్‌నో, అంత ఒబీడియంట్ గా ఉండే ప్రయత్నం కూడా చేశాను.నా వ్యక్తిత్వమే అలా ఉంటుంది. పెద్దల ముందు చేతులు కట్టుకునే వ్యక్తిని నేను. నాకు నా పార్టీ మీద ఎందుకు ఇంత విశ్వాసముందోనని నన్ను అడగక్కర్లేదు. గతంలో కూడా నేను ఎవరినో తెలియకుండానే నాకు టికెట్ ఇచ్చారు. ఆ రోజే నన్ను చూశారు (పోటీలో నిలబెట్టారు) అంటే ఈ రోజు చూడరా?నేను నా పార్టీకి విధేయత్వాన్ని



చూపించే టైం ఇది. పార్టీలో లేనప్పుడే పార్టీ గుర్తించింది నన్ను. ఐ యామ్ రెడీ.. పార్టీ ఏ జాబ్ ఇచ్చినా చేస్తాను. పోటీలో నిలబడమంటారా నిలబడతాను.. వేరో ఎవరినో నిలబట్టి నన్ను క్యాంపెయిన్ చేయమన్నా చేస్తాను. నాకు ఒక్క బూత్ ఇచ్చి ఆ బూత్‌లో క్యాంపెయినింగ్ చూసుకోమంటే కూడా చూసుకుంటాను" అని మాధవీలత అన్నారు.

## సంపాదకీయం

**గురువారం 17-07-2025**

# మస్క్ ముచ్చట తీరుతుందా?

ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ కొత్తగా అమెరికా పార్టీని స్థాపించారు. అగ్రరాజ్యంలో రెండు పార్టీల వ్యవస్థను అది మార్చగలదా అన్నది పెద్ద ప్రశ్న. గతంలోనూ అక్కడ కొన్ని వర్గాలు, కొందరు ప్రముఖులు మూడో పార్టీని స్థాపించినా ప్రయోజనం లేకుండా పోయింది. అయితే ఎలాన్ మస్క్‌కున్నంత ప్రాచుర్యం, అపార వనరులు గతంలో పార్టీ పెట్టినవారెవరికీ లేవు. అమెరికాను మళ్లీ మహత్తర దేశంగా నిలుపుదాం (మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్–మాగా) అనే నినాదం డొనాల్డ్ ట్రంప్‌ను అధికారంలోకి తెచ్చింది. మరోవైపు సామాజిక, జాతిపరమైన సమానత్వాన్ని ఆకాంక్షించే ఉదారవాద వర్గం 'వోక్'గా పేరుపడింది. 'మాగా గతం. వోక్ అంటే దృష్టిమళ్లింపు. అమెరికా భవిత ఈ రెండింటి మధ్యనున్న మెజారిటీ ప్రజల చేతిలో ఉంది. వారి ప్రతినిధిగా అమెరికా పార్టీ నిలుస్తుంది' అని మస్క్ ఉద్ఘాటించారు. కానీ, అమెరికా రాజకీయాల్లో మస్క్ పార్టీది నల్లేరు మీద నడక మాత్రం కాబోదు. అసలు అమెరికాలోని రెండు పార్టీల రాజకీయ వ్యవస్థే కొత్త పక్షాల ఎదుగుదలకు మోకాలడ్డుతోంది. ప్రథమ ప్రాధాన్య ఓట్లపై ఆధారపడి విజేతను ప్రకటించే పద్ధతి అమెరికాలో రెండు పార్టీల పెత్తనానికి కాంక్రీటు పునాది వేసింది. అనేక ప్రజాస్వామ్య దేశాలు ఈ పద్ధతిని వదిలిపెట్టి బహుళ పార్టీ వ్యవస్థకు చోటిచ్చాయి.

అన్నిచోట్లా పోటీ కీలకం

అమెరికాలో మూడో పార్టీ స్థాపనకు గతంలో ప్రయత్నాలు జరక్కపోలేదు. ప్రజాభిమానం దండిగా ఉన్న థియోడోర్ రూజ్‌వెల్ట్ 1912లో ప్రోగ్రెసివ్ పార్టీ పెట్టినప్పుడు రిపబ్లికన్ పార్టీ ఓట్లు చీలిపోయి, డెమోక్రటిక్ పార్టీకి చెందిన ఉడ్రో విల్సన్ అధ్యక్ష పదవిని చేజిక్కించుకున్నారు. తరవాత రూజ్‌వెల్ట్ పార్టీ సూత్రాలైన కార్మిక హక్కులు, అవినీతి నిరోధం వంటివి రిపబ్లికన్ పార్టీ అజెండాలో చేరాయి. ఇలా మూడో పార్టీ ముందుకుతెచ్చిన సమస్యలు, ఆశలు, ఆశయాలను రెండు ప్రధాన పార్టీలు తమలో ఇముడ్చుకుని యథాప్రకారం పెత్తనం కొనసాగించాయి. 1990ల్లో టెక్సస్ కోటీశ్వరుడు రాస్ పెరో స్థాపించిన రిఫార్మ్ పార్టీ 18.9శాతం ఓట్లు సంపాదించింది. రూజ్‌వెల్ట్ తరవాత అమెరికా రాజకీయాలను ప్రభావితం చేసిన ఘనత పెరోకు దక్కింది. రెండు ప్రధాన పార్టీలు బాధ్యతాయుత, ఆర్థిక విధానాలు అవలంబించేలా పెరో ఒత్తిడి చేయగలిగారు. ఆపైన లిబర్టేరియన్ పార్టీ, గ్రీన్ పార్టీలు అమెరికా రాజకీయ యవనికపై ప్రముఖంగా కనిపించాయి. గ్రీన్‌పార్టీ వల్ల 2000 సంవత్సరంలో డెమోక్రటిక్ అభ్యర్థి అల్ గోర్ ఓడిపోయి, రిపబ్లికన్ అభ్యర్థి జార్జ్ డబ్ల్యు బుష్ గెలవగలిగారు. ఆ తరవాత గ్రీన్ పార్టీ ప్రభావం స్థానిక, రాష్ట్ర ఎన్నికలకే- అదీ 10 రాష్ట్రాలకే పరిమితమవుతోంది. ఎలాన్ మస్క్ అమెరికా పార్టీ పూర్వ విఫల ప్రయోగాలకు భిన్నంగా ఉండాలంటే జాతీయ పార్టీగా గుర్తింపు పొందాలని, దానికోసం ప్రతి రాష్ట్రంలో పోటీ చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. అలా అభ్యర్థులను నిలిపే ఆర్థిక స్థోమత మస్క్‌కు ఉంది. 2026 నవంబరులో అమెరికా పార్లమెంటు(కాంగ్రెస్)కు జరిగే మధ్యంతర ఎన్నికల్లో ఆయన తన సత్తాను చాటగలిగితే 2028 అధ్యక్ష ఎన్నికలకు అమెరికా పార్టీ సన్నద్ధం కాగలుగుతుందని రాజకీయ విశ్లేషకులు వివరిస్తున్నారు. మస్క్ పార్టీ ముందునుంచే అధ్యక్ష పదవికి అభ్యర్థిని సిద్ధం చేయాల్సి ఉంటుందని వారు చెబుతున్నారు.

కింగ్‌మేకర్ కావాలంటే...

అమెరికా ఓటర్లలో 30–35శాతం మంది డెమోక్రటిక్ పార్టీకి, 25–30శాతం మంది రిపబ్లికన్ పార్టీకి విధేయులు. 35–40శాతం మంది స్వతంత్ర పంథా అనుసరిస్తారు. డెమోక్రటిక్, రిపబ్లికన్ ఓటర్లుగా నమోదైన వారిలో 60 నుంచి 70శాతం మంది పోలింగ్‌లో పాల్గొంటారు. స్వతంత్ర ఓటర్లలో 50–60శాతం మంది పోలింగ్ కేంద్రాలకు వస్తున్నారు. మస్క్ పార్టీ ఈ మూడు వర్గాల ఓటర్లలో ఎంతమందిని ఆకట్టుకోగలదో చూడాలి. ముఖ్యంగా రిపబ్లికన్, డెమోక్రటిక్ పార్టీలపై తన అభ్యర్థులను పోటీకి నిలిపి ఎంతమందిని కాంగ్రెస్‌కు పంపగలరనే దానిమీద మస్క్ పార్టీ భవితవ్యం ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం అమెరికా కాంగ్రెస్ ఉభయ సభల్లో రిపబ్లికన్లకు అత్తెసరు మెజారిటీ ఉంది. మస్క్ పార్టీ గణనీయ సంఖ్యలో సీట్లను సాధిస్తే రిపబ్లికన్లకు ఎసరు వస్తుంది. మస్క్ కింగ్ మేకర్ కాగలుగుతారు. మస్క్ తన బలాబలాలను సర్వేల ద్వారా ఎప్పటికప్పుడు నిర్ధారించుకోవచ్చు. రిపబ్లికన్లలో విభేదాలనూ ఆయన వాడుకోవచ్చు. వచ్చే ఏడాది జరిగే కాంగ్రెస్ మధ్యంతర ఎన్నికల్లో డబ్బు ధారాళంగా ఖర్చుచేసి తన అభ్యర్థులను గెలిపించుకోవడానికి మస్క్ ప్రయత్నించవచ్చు. అందులో ఆయన సఫలమైతే డొనాల్డ్ ట్రంప్‌నకు చుక్కలు చూపించే అవకాశం ఉంటుందని నిపుణులు జోస్యం చెబుతున్నారు.

# సీమకు కావాల్సింది గోదావరి కాదు.. కృష్ణా జలాలే!



హైదరాబాద్, రాయలసీమకు కావాల్సింది కృష్ణా జలాలే కానీ ఏపీ ఆర్థిక వ్యవస్థను కోలుకోలేని దెబ్బతీసే గోదావరి జలాలు కాదని రాయలసీమకు చెందిన మేధావులు, సాగునీటి రంగ నిపుణులు స్పష్టంచేస్తున్నారు. వెనుకబడిన రాయలసీమ పేరు చెప్పి మరో గుదిబండ కాగల బనకచర్ల ప్రాజెక్ట్‌కు ఏపీ సర్కార్ ఉవ్విళ్లూరడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది తెలంగాణ తరహాలో ఆంధ్ర కాళేశ్వరం అయ్యే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఏపీ రాజకీయాలలో తాను బద్ధ శత్రువుగా భావించే చంద్రబాబు బనకచర్ల ప్రాజెక్టు అంశాన్ని ముందుకు తీసుకెళుతుంటే ప్రతిపక్ష నేత జగన్ కనీసం నోరు విప్పకపోవడంపై వారు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ ఏపీ ప్రభుత్వాన్ని తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేస్తుందని తేల్చిచెబుతున్నారు. సీమ పేరు చెప్పి ఏపీ ప్రజలపై ఆర్థిక భారం మోపవద్దని రాయసీమ మేధావులు ప్రభుత్వానికి హితబోధ చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోకపోవడం గమనార్హం. ఏపీలో అత్యంత వెనుకడిన ప్రాంతం రాయల సీమ జిల్లాలు. ఇక్కడ మొత్తం 1.07 కోట్ల ఎకరాల భూమి ఉండగా, అన్నిరకాల సాగుకు అనువైన భూమి 49 లక్షల ఎకరాల లోపే. సాగుకు అనువైన భూమి మొత్తానికి సాగునీరు అందించడానికి 400 టీఎంసీల నీరు అవసరం అవుతున్నది. ఇప్పటికే శ్రీశైలం రిజర్వాయర్ నుంచి పోతిరెడ్డి పాడు హెడ్ రెగ్యులేటర్, ఎస్‌ఆర్‌బీసీ, తుంగభద్ర హైలెవల్ కెనాల్, కేసీ కెనాన్, ముచ్చుమర్రిల నుంచి దాదాపు 300 టీఎంసీల నీరు వస్తున్నది. ఇందులో ఒక్క శ్రీశైలం నుంచే దాదాపు 250 టీఎంసీల వరకు రాయలసీమకు సాగునీరు వెళుతున్నది. శ్రీశైలం నుంచి సోమశిల– కండలేరుకు కలిపి నెల్లూరు జిల్లాకు కూడా తీసుకువెళుతున్నారు. ఈ జలాలు కాక మహా అయితే మరో వంద టీ సీఎంల నీరు రాయలసీమ జిల్లాలకు అవసరం అవుతుంది. కేవలం వంద టీఎంసీల నీటిని రాయలసీమకు తీసుకోవడానికి బనకచర్ల అవసరం లేదన్నది రాయలసీమ మేధావులు చెపుతున్న మాట. ఏపీ పాలకులు ఇప్పటి వరకు వివిధ దఫాలుగా రాయలసీమకు సాగు నీరు అందించడం కోసం 32 రిజర్వాయర్లు నిర్మించారు. వీటికి కృష్ణా, తుంగభద్ర జలాలు అందించడానికి దాదాపు 10 నదులు, ఉప నదులను అనుసంధానం చేశారు. కానీ.. ఆ నీటిని రైతుల భూములకు పంపించే ప్రధాన కాలువలతో పాటు డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్‌ను మాత్రం నిర్మించలేదు. కొన్నిచోట్ల నిర్మించినా నామ్‌కే వాస్తే అన్నతీరుగా ఉన్నాయి. రిజర్వాయర్లకు కాలువలు తవ్వకుండా, సాగు కాలువలు (డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ తయారు చేయకుండా అందుబాటులో ఉన్న నీటిని ఎలా వినియోగించుకుంటారని సీమ ప్రజలు అడుగుతున్నారు. అందుబాటులో ఉన్న నీటిని వినియోగించుకునే వ్యవస్థను ముందుగా నిర్మించాలని కోరుతున్నారు. వాస్తవంగా హంద్రీ..నీవా ప్రాజెక్ట్ నుంచి నీటిని లిఫ్ట్ చేయడానికి మొదట10 మోటర్లు బిగించారు. అయితే ఏనాడూ ఆ పది మోటర్లనూ నడిపింది లేదు. మూడు మోటర్లను ఆన్ చేసి.. వాటి నుంచి బయటకు వచ్చిన నీటిని ఎటూ తీసుకెళ్లే మార్గంలేక అలాగే వదిలేశారు. ఇక్కడ పది మోటర్లనూ వినియోగించి నీటిని లిఫ్ట్ చేసేందుకు ఏర్పాటు చేయని సర్కారు.. అవే మోటర్లను తీసుకెళ్లి, పట్టిసీమ పథకంలో వినియోగించి అక్కడ నీటిని ఎత్తిపోయడం విశేషం. హంద్రీ–నీవా కింద 4,04,500 ఎకరాలకు నీళ్లిస్తామన్న ప్రభుత్వం.. ఇప్పటి వరకూ అందులో సగం.. అంటే రెండు లక్షల ఎకరాలకు కూడా నీళ్లు ఇవ్వలేదని ఏపీ ప్రాంత మేధావులు గుర్తు చేస్తున్నారు. జగన్ సర్కారు హయాంలో హంద్రీ–నీవా ప్రధాన కాలువకు అడ్డంగా కాంట్రాక్టర్ రోడ్డు వేసి నీరు వెళ్లకుండా అడ్డుకోవడం గమనార్హం. దీనిపై స్థానికులు అభ్యంతరాలు చెబుతూ ఆందోళనకు దిగిన తర్వాతగానీ సదరు కాంట్రాక్టర్ ఆ రోడ్డును తొలగించలేదు. ప్రధాన కాలువలు కూడా అంత ఆగమ్య గోచరంగా ఉన్నాయి. రాయలసీమలో సాగయ్యే 49 లక్షల ఎకరాల భూమికి సరాసరి 400 టీఎంసీల నీరు అవసరం అవుతుందని సాగునీటి నిపుణుల అంచనా. ఇప్పటికే దాదాపు 300 టీఎంసీల నీటిని డ్రా చేస్తున్నందున మరో 100 టీఎంసీల నీటిని ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తే సరిపోతుందన్న అభిప్రాయం ఏపీ మేధావుల్లో వ్యక్తం అవుతున్నది. ఇందుకోసం గోదావరి జలాలతో కూడిన బనకచర్ల ప్రాజెక్టు అవసరం లేదని తేల్చి చెబుతున్నారు. గోదావరి నీటిని కృష్ణా డెల్టాకు, సాగర్ కుడికాలువ ఆయకట్టుకు అందిస్తే.. అక్కడ వినియోగించే 312 టీఎంసీల నికర జలాలను ఎగువ ప్రాంతాలు వినియోగించుకోవడానికి వీలు ఉంటుందని వివరిస్తున్నారు. దీంతో కృష్ణాలో నికర జలాల నుంచే రాయలసీమకు నీటి కేటాయింపులు చేయవచ్చునని సూచిస్తున్నారు. ఇలా చేయడం ద్వారా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వానికి ఆర్థిక భారం పడదని, పైగా రాయలసీమకు నికరజలాలు అందించ వచ్చునని చెపుతున్నారు. చంద్రబాబు ప్రభుత్వానికి రాయలసీమపై నిజమైన ప్రేమ ఉంటే చేయవలసిందల్లా నికర జలాలు కేటాయించడంతో పాటు 32 రిజ్వాయర్లనుంచి నీటిని రైతులకు అందించే విధంగా ప్రధాన కాలువలు, డిస్ట్రిబ్యూటరీ కాలువలు నిర్మించడమేనని అంటున్నారు. చంద్రబాబు ప్రభుత్వం ఈ పని చేయకుండా బనకచర్ల జపం చేయడంపై రాయలసీమ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏపీ ప్రభుత్వం ఇప్పటికే పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు 80 టీఎంసీల గోదావరి నీటిని తరలిస్తున్నది. అలాగే గోదావరి నీటిని కృష్ణా డెల్టాతో పాటు సాగర్ కుడికాలువ ఆయకట్టుకు మాత్రమే తరలిస్తే.. అంతమేరకు ఎగువ ప్రాంతానికి కృష్ణాజలాలను వినియోగించే అవకాశం ఉంది. దీన్ని వదలి ఏకంగా రాయలసీమకే గోదావరి జలాలు తీసుకు వస్తామని, ఈ మేరకు రూ. 80 వేల కోట్లతో బనకచర్ల నిర్మిస్తామని చెప్పడాన్ని ఆంధ్రా మేధావులు, ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇది రైతుల కోసం కాదు.. కాంట్రాక్టర్ల కోసం చేపట్టిన ప్రాజెక్ట్‌గా అభివర్ణిస్తున్నారు.

# రిజర్వేషన్ల చుట్టూ 'రాజకీయం'

హైదరాబాద్: రాష్ట్ర రాజకీయాలన్నీ బీసీ రిజర్వేషన్ల అంశం చుట్టూనే తిరుగుతున్నాయి. స్థానిక సంస్థలకు మూడు నెలల్లో ఎన్నికలను నిర్వహించాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఊపందుకున్న రిజర్వేషన్ల రగడను రాజకీయంగా ఉపయోగించుకునేందుకు అన్ని ప్రధాన పార్టీలు ఎత్తులు వేస్తున్నాయి. ఇందులో అధికార కాంగ్రెస్ ఓ అడుగు ముందుండగా.. బీఆర్ఎస్, బీజేపీ కూడా బీసీల మన్ననలు పొందేందుకు తమదైన శైలిలో ప్రయత్నిస్తున్నాయి. అయితే, పార్టీల వ్యూహ, ప్రతివ్యూహాలు ఎలా ఉన్నా.. ఈసారి స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు అమలుకాకుండా ఎక్కడ ఆగిపోతాయేమోననే ఆందోళన బీసీ సంఘాలు, ఆయా వర్గాల ప్రజల్లో వ్యక్తమవుతోంది. మొత్తం మీద బీసీ రిజర్వేషన్ల అంశంలో రాజకీయ కౌంటర్లు, ఎన్‌కౌంటర్లు, కోర్టు కేసు వ్యవహారంపై భిన్నాభిప్రాయాల నేపథ్యంలో అసలు ఎన్నికల ప్రక్రియ ఎప్పుడు ప్రారంభమవుతుందో తెలియకుండానే రాష్ట్రంలో 'స్థానిక'వేడి మొదలుకావడం గమనార్హం.

అధికార పార్టీ ఏమనుకుంటోందంటే..

ఎవరెంతో.. వారికంత అంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అందిపుచ్చుకున్న దేశవ్యాప్త నినాదంతో సామాజిక న్యాయం చేస్తున్నామని చెప్పుకునేందుకు తెలంగాణ కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ఎస్సీల వర్గీకరణ, మంత్రివర్గ విస్తరణతోపాటు తాజాగా రాష్ట్ర కేబినెట్ ఆమోదించిన ఆర్డినెన్స్‌తో అన్ని వర్గాలకు తాము న్యాయం చేస్తున్నామని చెబుతోంది. అంతకంటే ముందు అసెంబ్లీలో ఆమోదం పొందిన బీసీ బిల్లు కూడా కామారెడ్డి డిక్లరేషన్‌ను చిత్తశుద్ధితో అమలు చేస్తున్నామనేందుకు నిదర్శనమని ఆ పార్టీ నేతలంటున్నారు. తాము మాత్రమే బీసీలకు న్యాయం చేయగలమని, అందుకే చేశామని ఆ పార్టీ నేతలంటుండగా సీఎం రేవంత్‌రెడ్డి మరో అడుగు ముందుకేసి రాహుల్‌గాంధీ ప్రధాని అయి ఉంటే 48 గంటల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయించేవాడినన్నారు. కేబినెట్ ఆర్డినెన్స్ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా సంబురాలు నిర్వహించి తామే బీసీల చాంపియన్‌నని చెబుతోంది. ఈ నేపథ్యంలోనే మరోమారు ఢిల్లీ యాత్రకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. అయితే, ఈ పార్టీ వర్గాల్లో బీసీ రిజర్వేషన్ల ఆర్డినెన్స్ ఆగం చేస్తుందా అనే మీమాంస కూడా కనిపిస్తోంది. ఇప్పటికే అసెంబ్లీలో ఆమోదం పొందిన బీసీ బిల్లు రాష్ట్రపతి, పార్లమెంటు ఆమోదం కోసం పెండింగ్‌లో ఉండగా, ఇప్పుడు ఆర్డినెన్స్ తీసుకురావడం ఏ మేరకు మేలు చేస్తుందనే దానిపై ఆ పార్టీ నేతల్లోనూ సందేహాలు వ్యక్తమవుతుండటం గమనార్హం.

విపక్షాలు ఏమనుకుంటున్నాయంటే...

కర్ర విరగకుండా పాము చావకుండా కాంగ్రెస్ వ్యవహరిస్తోందని, అధికారంలో ఉన్న పార్టీగా చేయాల్సింది చేయకుండా బీసీ వర్గాలను బుట్టలో వేసుకోవడమే లక్ష్యంగా ముందుకెళ్తోందని ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి. బీసీలకు రిజర్వేషన్లు కల్పించే విషయంలో రాష్ట్రం నుంచి అఖిలపక్షాన్ని ప్రధాని వద్దకు తీసుకెళ్తానని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో బిల్లు ఆమోదం పొందినప్పుడే చెప్పారని, అయితే ఇప్పటివరకు ఆ ప్రయత్నం ఎందుకు చేయలేదని నిలదీస్తున్నాయి. అన్ని పార్టీలను ప్రధాని వద్దకు తీసుకెళ్తానని చెప్పిన తర్వాత ఎన్నోసార్లు ఢిల్లీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలిసి వచ్చిన ఆయన కనీసం ఒక్కసారి కూడా ఎందుకు బీసీ బిల్లు ఆమోదం గురించి వినతిపత్రం ఇవ్వలేదని ప్రశ్నిస్తున్నాయి. రాష్ట్రపతి వద్దకు వెళ్లిన బిల్లును ఆమోదింపజేసి పార్లమెంటు ఆమోదం కోసం తీసుకురావడంలో కాంగ్రెస్ చేసిన కృషి ఏంటో చెప్పాలని డిమాండ్ చేస్తున్నాయి. బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలన్న ప్రధాన డిమాండ్‌ను వినిపిస్తున్న బీఆర్ఎస్ ఈ విషయంలో కాంగ్రెస్ వైఖరిని తప్పుపడుతోంది. బీసీలను మోసం చేసేందుకే ఆర్డినెన్స్ అంటున్నారని, ఏకసభ్య కమిషన్ పేరుతో ఇచ్చిన నివేదిక లొసుగులతో ఉందని, ఈ నేపథ్యంలో బీసీలకు న్యాయం జరిగే పరిస్థితి లేదని అంటోంది. ఇక, బీజేపీ కూడా ఈ విషయంలో



కాంగ్రెస్ వైఖరిని తప్పుపడుతోంది. రాష్ట్రపతి వద్ద బిల్లు పెండింగ్‌లో ఉండగా, ఆర్డినెన్స్ తేవడం బీసీలను ఏమార్చడానికేనని అంటోంది. తాము బహిరంగంగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశానికి మద్దతిస్తున్నా.. అటు రాష్ట్రపతితోపాటు ఇటు పార్లమెంటులోనూ రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లుకు ఆమోదం పొందకపోతే తమకు 'స్థానిక'ంగా పట్టురాదేమోననే ఆందోళన కమలనాథుల్లో వ్యక్తమవుతోంది.

బీసీ సంఘాలు ఏమంటున్నాయి...

ఆర్డినెన్స్ ఆధారంగా ప్రభుత్వం జారీ చేయాలనుకుంటున్న రిజర్వేషన్ల జీవోకు న్యాయపరంగా ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతాయన్న దానిపై బీసీ సంఘాల్లో, ఆయా వర్గాల ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ జీవో కోర్టులో నిలబడుతుందా లేదా అన్న దానిపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. కోర్టులో సవాల్ చేస్తే నిలబడదని కొందరు, కొన్ని ప్రాతిపదికల మీద నిలబడుతుందని మరికొందరు అంటున్నారు. గతంలో సుప్రీంకోర్టు చెప్పిన విధంగా రిజర్వేషన్ల సీలింగ్ 50 శాతానికి పరిమితం అవుతుందని, ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన కల్పించే రిజర్వేషన్లు పోను 42 శాతం రిజర్వేషన్లు బీసీలకు వర్తింపజేయడం సుప్రీంతీర్పు అమల్లో ఉన్నంతవరకు సాధ్యం కాదని, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే జీవోను సవాల్ చేస్తే వెంటనే కోర్టు కొట్టి వేస్తుందనేది వారి వాదన. అయితే, గతంలో బీసీల జనాభా లెక్కలు అందుబాటులో లేనందున కోర్టులు కొట్టివేశాయని, ఇప్పుడు ప్రభుత్వం చేసిన కుల సర్వేలో బీసీల జనాభా 56 శాతంగా తేలిందని, బీసీలకు తగినంత రిజర్వేషన్లు కల్పించవచ్చని సుప్రీంకోర్టు తీర్పులోనే పేర్కొన్నందున 42 శాతం కోటా న్యాయ సమీక్షలో నిలబడుతుందని మరికొందరు వాదిస్తున్నారు. అలాగే, డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు అంశం కూడా ఈ వాదనకు బలాన్నిస్తుందని అంటున్నారు. మరోవైపు అగ్రవర్ణాలకు ఈడబ్ల్యూఎస్ కోటా అమలు చేసే క్రమంలోనే 50 శాతం సీలింగ్ చాలా రాష్ట్రాల్లో దాటిపోయిందని, తెలంగాణలోనూ ఇబ్బంది ఉండదని వారంటున్నారు. మరోవైపు బీసీ వర్గాలకు న్యాయం జరుగుతున్నందున దాన్ని అడ్డుకోవద్దని, కోర్టులో కేసులు వేయొద్దని అటు రాజకీయ పార్టీలకు, ఇటు ప్రజలకు బీసీ సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నా ఏ క్షణంలో కోర్టులో కేసు పడుతుందోననే గుబులు మాత్రం కనిపిస్తోంది. బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో ఇచ్చిన మరుసటి రోజే ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైతే ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనందున కోర్టు కూడా జోక్యం చేసుకోదనే వాదన సముచితం కాదనే భిన్నమైన అంశాన్ని బీసీ సంఘాల నిపుణులు తెరపైకి తెచ్చారు. గతంలో మహారాష్ట్రలో ఇదే జరిగిందని, మరాఠాలను బీసీల్లో చేర్చి, వారికి రిజర్వేషన్లు కల్పించి పంచాయతీ ఎన్నికలకు వెళ్తే సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని మరీ ఎన్నికల ప్రక్రియను నిలిపివేసిందని అంటున్నారు. ఈ నేపథ్యంలో జీవోలు, ఆర్డినెన్స్‌ల కంటే పార్లమెంటు ఆమోదం ద్వారా 42 శాతం రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చడమే రక్షణ కవచమని, ఆ కోణంలోనే అన్ని పార్టీలు చిత్తశుద్ధితో పనిచేయాలని బీసీ సంఘాలు కోరుతున్నాయి.

# యెమెన్‌తో కేంద్రం చర్చలు ఫలవంతం

న్యూఢిల్లీ,యెమెన్‌లో కేరళ నర్సు నిమిష ప్రియకు భారీ ఊరట దక్కింది. యెమెన్ ప్రభుత్వం చివరిక్షణంలో ఉరిశిక్ష అమలును వాయిదా వేసింది. ప్రస్తుతం యెమెన్ ప్రభుత్వంతో కేంద్రం చర్చలు కొనసాగుతున్నది. కేంద్ర ప్రభుత్వం అన్ని రకాలుగా ఆమెను రక్షించేందుకు ప్రయత్నిస్తుంది. ఎట్టకేలకు ఆ ప్రయత్నాలు ఫలించడంతో బుధవారం అమలు కావాల్సిన ఉరిశిక్ష తాత్కాలికంగా వాయిదా పడింది. ఆమె మరణశిక్ష అమలును యెమెన్ వాయిదా వేసినట్లు భారత విదేశాంగ శాఖ వర్గాలు వెల్లడించాయి. గతంలో నిర్ణయించిన ప్రకారం.. జులై 16న ఈ శిక్ష అమలుచేయాల్సి ఉండగా.. చివరి క్షణంలో స్థానిక అధికారులు దీన్ని నిలిపివేసినట్లు– సమాచారం. ఈ కేసు మొదలైనప్పటి నుంచి నిమిష ప్రియకు అన్నివిధాలా సాయం చేసేందుకు భారత ప్రభుత్వం ప్రయత్నిస్తూనే ఉంది. నిమిష కుటుంబం.. బాధిత కుటుంబం పరస్పర అంగీకారానికి వచ్చి కేసును పరిష్కరించుకునేలా కొంత సమయం ఇచ్చేలా ప్రయత్నాలు చేశాం. స్థానిక జైలు అధికారులు, ప్రాసిక్యూటర్ ఆఫీసుతో నిరంతరం సంప్రదింపులు జరిపాం. అవి ఫలించి మరణశిక్ష అమలును వాయిదా వేసేందుకు యెమెన్ అధికారులు అంగీకారం తెలిపారని విదేశాంగ శాఖ వర్గాలు వెల్లడించాయి. ఈ కేసులో బ్లడ్ మనీ తీసుకునేలా బాధిత కుటుంబాన్ని ఒప్పించేందుకు మత గురువు కాంతాపురం ఏపీ అబూబకర్ ముస్లియార్ సంప్రదింపులు జరిపిన సంగతి తెలిసిందే. ఆ చర్చలు కూడా సానుకూలంగా జరుగుతున్నట్లు సమాచారం. బాధిత కుటుంబానికి ఒక మిలియన్ డాలర్ల (దాదాపు రూ. 8.6కో) క్షమాధనాన్ని ఇచ్చేందుకు నిమిష ప్రియ కుటుంబం సిద్ధమైంది. ఇందుకు వారు అంగీకరిస్తే.. నిమిష ప్రియకు మరణశిక్ష తప్పే అవకాశం ఉంది. ఉరికి కేవలం కొన్ని గంటలు మాత్రమే మిగిలి ఉన్న క్రమంలో మోడీ సర్కార్ చేసిన ప్రయత్నాలు ఫలించి ఉరితీతు తాత్కాలికగా వాయిదా వేశారు. నిమిష కుటుంబం మాత్రం నిమిషను రక్షించుకోవడానికి ప్రయత్నాలు చేస్తూనే ఉంది. ఉన్న ఒకదారి అగమ్యగోచరంగా మారింది. హతుడి కుటుంబం అడిగినంత డబ్బు ఇవ్వగలిగితే.. చివరి నిమిషంలోనైనా నిమిషకు ఉరి తప్పే అవకాశం ఉంది. కొన్ని నెలల క్రితమే నిమిష ప్రియ కుటుంబం బ్లడ్ మనీ కింద 10 లక్షల డాలర్లు సిద్ధం చేసుకుంది. అయితే, నిమిష కుటుంబానికి, హతుడి కుటుంబానికి మధ్యవర్తిత్వం వహించిన లాయర్ దెబ్బ కొట్టాడు. పెద్ద మొత్తంలో ఫీజు డిమాండ్ చేశాడు. తన ఫీజు చెల్లించే వరకు బ్లడ్ మనీ చర్చలు జరపనని తేల్చి చెప్పాడు. దీంతో ఎప్పుడో పూర్తి కావాల్సిన బ్లడ్ మనీ వాయిదా పడింది. ప్రస్తుతం నిమిష ప్రియ కుటుంబం తరపున శామ్యుయెల్ జెరోమ్, షేక్ హబీబ్ హుమర్‌లు మధ్యవర్తిత్వం వహిస్తున్నట్లు సమాచారం. 10 లక్షల డాలర్లు వెంటనే ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని నిమిష కుటుంబం.. హతుడి కుటుంబానికి చెప్పిందని సమాచారం. అయితే, మృతుడి కుటుంబం మాత్రం బ్లడ్ మనీ విషయంలో ఇంకా ఎలాంటి సమాధానం చెప్పలేదని తెలుస్తోంది. ఉరికి గంటల ముందు హతుడి కుటుంబం బ్లడ్ మనీకి ఒప్పుకుంటుందా అన్నది ఓ పెద్ద ప్రశ్నగా మారింది. ఈ క్రమంలో కేంద్రం తీసుకున్న చర్యలకారణంగా ఉరిని యెమెన్ పాలకులు వాయిదా వేశారు. దీంతో బ్లడ్ మనీ చర్చలకు మరోమారు అవకాశం ఏర్పడింది.

# ఎందుకిలా మారిపోయారు?

హైదరాబాద్,ఆయన విజయవంతమైన వ్యాపారి.. ఆ తర్వాత విజయవంతమైన రాజకీయవేత్త.. అప్పట్లో తెలంగాణ రాష్ట్రంలో కారు జోరు కొనసాగుతున్నప్పుడు.. దానిని ఫ్యాన్ గాలి ద్వారా ఆపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 2014లో జరిగిన ఎన్నికల్లో ఫ్యాన్ పార్టీ హవా చూపించారు. ఏకంగా అశ్వరావుపేట, వైరా ఎమ్మెల్యేలను గెలిపించుకొని సంచలనం సృష్టించారు. అంతేకాదు తను కూడా పార్లమెంట్ సభ్యుడిగా గెలిచి రికార్డు సృష్టించారు. మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఆయన కారులో కూర్చున్నారు. కొంతకాలానికి అందులో నుంచి బయటికి వచ్చారు. హస్తం పార్టీలో కీలక నాయకుడిగా కొనసాగుతున్నారు. ఇప్పుడు వ్యాపారాన్ని కొడుకు చూస్తున్నారు. రాజకీయాన్ని ఆయన చేస్తున్నారు. అంతేకాదు కాంగ్రెస్ పార్టీలో ఎవరికి సాధ్యం కాని విధంగా ఎమ్మెల్యే అయిన తొలిసారే ఏకంగా రెవెన్యూ మంత్రి అయ్యారు. అంతేకాదు ప్రభుత్వంలో అత్యంత కీలకమైన సమాచార పౌర సంబంధాల శాఖను తీసుకున్నారు. అంతేకాదు కేసీఆర్ మానస పుత్రిక అయిన ధరణిని బంగాళాఖాతంలో కలిపి భూభారతిని తెరపైకి తీసుకువచ్చారు.. భూభారతి అమల్లో వేగవంతమైన అడుగులు వేస్తున్నారు. తద్వారా రెవెన్యూ శాఖ మంత్రిగా మంచి పేరు తెచ్చుకుంటున్నారు.. ఇలాంటి క్రమంలో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఒకసారిగా తన రూట్ మార్చారు. ఈ మాట అన్నది సాక్షాత్తు ఆయన పార్టీ నాయకులు.. ఆయనను అనుసరించే వ్యక్తులు. సోమవారం తన సొంత నియోజకవర్గమైన పాలేరులో పొంగులేటి పర్యటించారు.. ఈ స్థానంలో గెలిచిన తర్వాత అనేక పర్యాయాలు పొంగులేటి పర్యటించారు. పర్యటిస్తూనే ఉంటారు. అయితే ఈసారి ప్రజలకు మాత్రం ఒక ప్రత్యేకత ఉంది. అదేంటంటే ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క తో కలిసి ఆయన తన నియోజకవర్గంలో పర్యటించారు.. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, భట్టి విక్రమార్క మంత్రులుగా కొనసాగుతున్నారు. అయితే ఇప్పటివరకు ఈ ముగ్గురు నాయకులు కలిసి పర్యటించారు. వేరువేరుగా పర్యటించారు. అయితే పాలేరు నియోజకవర్గంలో మాత్రం భట్టివిక్రమార్కను ప్రత్యేకంగా ఆహ్వానించారు పొంగులేటి. అంతేకాదు అధికారికంగా భారీ ఎత్తున ఒక కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ఇది రాజకీయంగా చర్చకు దారి తీస్తోంది.. నాగార్జునసాగర్ లోని ఎడమ ప్రధాన కాలువ కింద అంతర్గత కాలువ పనులను ఇటీవల యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశారు. సాగర్ ఎడమ కాలువ పరిధిలోని ఆయకట్టుకు రెండవ జోన్ ద్వారా భట్టితో కలిసి పొంగులేటి నీటిని విడుదల చేశారు. అంతర్గత కాల్వపనులను గత రాత్రి మంత్రి పరిశీలించారు. అప్పటికప్పుడు అక్కడి నుంచి డిప్యూటీ సీఎం కు ఫోన్ చేశారు. తన సెగ్మెంట్ కు రావాలని కోరారు. వాస్తవానికి డిప్యూటీ సీఎం ఖమ్మం టూర్ లో పాలేరు లో కార్యక్రమం లేదు. మధిరలోని చింతకాని మండలంలో మాత్రమే భట్టి అఫీషియల్ టూర్ డిక్లేర్ అయింది. పొంగులేటి మంత్రి అయిన తర్వాత తొలిసారి భట్టిని తన నియోజకవర్గానికి పిలిపించి అధికారికంగా కార్యక్రమాన్ని నిర్వహించడం ఆసక్తికరంగా మారింది.

# పంచాయితీ ఎన్నికలపై బిఆర్ఎస్ నజర్

మహబూబ్‌నగర్, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పంచాయితీ ఎన్నికలు బిఆర్ఎస్ నేతలకు సవాల్ కానున్నాయి. ముఖ్యంగా మాజీమంత్రి శ్రీనివాస గౌడ్ తదితరులు ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. బిసి కేడర్‌లో ఉత్సాహం నింపుతున్నారు. ప్రస్తుతం 1,686 పంచాయతీలు, 800 ఎంపీటీసీ, 77 జడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. గతంలో వనపర్తి జిల్లాలో 255 పంచాయతీలు ఉండగా.. ఇప్పుడు ఆ సంఖ్య 268కి చేరింది. ఏదుల నూతన మండలం ఏర్పాటు కావడంతో నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలంలోని కొన్ని గ్రామాలను ఏదుల మండలంలో విలీనం చేశారు. అలాగే ఏదుల జడ్పీటీసీ స్థానం కూడా కొత్త మండల ఏర్పాటుతో పెరిగింది. జోగులాంబ గద్వాల జిల్లాలో కూడా కొత్తగా ఎర్రవల్లి జడ్పీటీసీ స్థానం పెరిగింది. నారాయణపేట జిల్లాలో కొత్తపల్లి, గుండుమాల్ జడ్పీటీ–సీ స్థానాలు కొత్తగా అయ్యాయి. కొత్త మండలాలు,

# దేశానికి గేమ్ ఛేంజర్‌గా పివి ఆర్థిక సంస్కరణలు

న్యూఢిల్లీ,మాజీ ప్రధాని పీవీ నరసింహారావు గొప్ప రాజనీతిజ్ఞుడని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. పివి తీసుకుని వచ్చిన ఆర్థిక సంస్కరణలు దేశానికి గేమ్ ఛేంజార్‌గా ఆర్థికరంగానికి ఊతంగా నిలిచాయని అన్నారు. దేశానికి అనేక రంగాల్లో పీవీ నరసింహారావు సేవలందించారు. ఆర్థిక సంస్కరణలు అంటే గుర్తొచ్చేది పివియేనని అన్నారు. లైసెన్స్‌రాజ్ నిబంధనల నుంచి దేశాన్ని బయటకు తెచ్చారు. 1990ల్లో దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది. సరైన విధానాలు లేక అస్తవ్యస్తంగా ఉండేది. ఆ సమయంలో పీవీ దూరదృష్టితో ఆర్థిక విధానాలను అమలు చేశారు. ఆయన ప్రధాని అయ్యాక దేశ ఆర్థిక సంస్కరణలు కొత్తరూపు సంతరించుకుని గేమ్ ఛేంజర్‌గా మారాయి. పీవీ నరసింహారావు కృషితోనే ఐటీ విప్లవం వచ్చిందని చంద్రబాబు అన్నారు. ఉమ్మడి ఏపీ అభివృద్ధిలో ఆయన పాత్ర ఎంతో ఉందని చెప్పారు. 17 భాషలు నేర్చుకున్న పీవీ.. ప్రధాని, కేంద్రమంత్రి, సీఎంగా సేవలందించారని గుర్తుచేశారు. దిల్లీలో నిర్వహించిన లెక్చర్ సిరీస్ ఆరో ఎడిషన్ కార్యక్రమానికి సీఎం హాజరయ్యారు. 'లైఫ్ అండ్ లెగసీ ఆఫ్ పీవీ' అంశంపై ఆయన మాట్లాడారు. మైనారిటీ- ప్రభుత్వంలోనూ పీవీ చాలా లౌక్యంగా వ్యవహరించారు. పీవీ తెచ్చిన సంస్కరణలను వాజ్‌పేయీ కొనసాగించారు. వాజ్‌పేయీ హయాంలో హైవేలు, విమానాశ్రయాలు, పోర్టులు వచ్చాయి. 2014లో మోదీ ప్రధాని అయిన తర్వాత ఆయన కూడా అనేక సంస్కరణలు తీసుకొచ్చారు. మోదీ హయాంలో భారత్ పేరు ప్రపంచవ్యాప్తంగా మార్మోగుతోంది. అనేక దేశాలతో ఆయన మంచి సంబంధాలు కొనసాగిస్తున్నారు. సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్.. సబ్‌కా విశ్వాస్ పేరుతో ముందుకెళ్తున్నాం అని చంద్రబాబు అన్నారు. నేను చాలా అదృష్టవంతుడిని.. మాజీ ప్రధాని పీవీ నరసింహారావుతో కలిసి పనిచేసే అవకాశం లభించిందని చంద్రబాబు నాయుడు గుర్తుచేసుకున్నారు.. పీవీ భారత ముద్ద బిడ్డ, భారత రత్న.. అసలుసిసలు తెలుగు బిడ్డ అని కీర్తించారు.. ఆయనతో నాకు మంచి సన్నిహిత సంబంధాలు ఉండేవని గుర్తుచేసుకున్నారు.. 17 భాషల్లో పీవీ నిష్ణాతుడు.. కానీ, ప్రస్తుతం హిందీ భాష నేర్చుకోవడం పై పెద్ద రాద్ధాంతం చేస్తున్నాం అని విమర్శించారు. ఎంతో సంయమనం, ఆలోచనపరమైన దార్శనికుడు, రాజనీతిజ్ఞుడు పీవీ అంటూ కొనియాడారు. గతంలో భారత ఆర్థికాభివృద్ధి రేటు- 3 నుంచి 5 శాతం ఉండేది.. గతంలో భారత దేశానికి చెందిన బంగారాన్ని తాకట్టు- పెట్టే పరిస్థితుల్లో ఉన్నాం.. పిల్లి రంగు నలుపా, తెలుపా అనే వ్యత్యాసంతో చూడరాదు.. ఎలుకను పట్టుకునే పిల్లి అయితే చాలు అన్నారు చంద్రబాబు.. సంక్షోభాన్ని ఒక అవకాశంగా తీసుకోవాలి. సరిగ్గా అదే చేశారు పీవీ నరసింహారావు అని తెలిపారు.. 1991లో దివంగత పీవీ నరసింహారావు ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణల ఫలాలను ఇప్పుడు దేశ ప్రజలంతా అనుభవిస్తున్నారు.. అన్ని పార్టీల మధ్య రాజకీయ ఏకాభిప్రాయం సాధించడంలో అసాధారణ ప్రతిభాశాలి పీవీ అంటూ ప్రశంసలు కురిపించారు చంద్రబాబు. 2014లో ప్రపంచంలో 11వ ఆర్థిక శక్తిగా భారత్ ఉంది.. 2028 కల్లా భారత్ మూడవ ఆర్థిక శక్తిగా ఆవిర్భవిస్తామన్న విశ్వాసం నాకు ఉందన్నారు చంద్రబాబు.. 2047 కల్లా భారత్ ప్రపంచంలోనే నెంబర్ 1 ఆర్థిక శక్తిగా ఆవిర్భవిస్తామనడంలో ఏమాత్రం సందేహం లేదన్నారు.. 1991లో పీవీ నరసింహారావు ఆర్థిక సంస్కరణలు అమలు చేయడం ప్రారంభించారు.. అప్పట్లో 3 నుంచి 4 వరకు భారత్ ఆర్థికాభివృద్ధి రేటు ఉండేది.. ప్రస్తుతం భారత్ ఆర్థికాభివృద్ధి రేటు- 6 నుంచి 7 వరకు ఉంది. 2047 కల్లా భారత్ వృద్ధి రేటు- 10కి మించి ఉంటుందనే నమ్మకాన్ని చంద్రబాబు నాయుడు వ్యక్తం చేశారు.

# బీజేపీది అత్యాశేనా ?

న్యూఢిల్లీ,దక్షిణాదిన బీజేపీ ఒక రాష్ట్రంలో గెలిచింది. అక్కడే అధికారం కూడా చేపట్టింది. అదే కర్ణాటక. ఇక్కడ కూడా పూర్తిగా బలపడడం లేదు. ఒకసారి 2018లో గెలిస్తే మరోసారి 2023లో ఓటమి పాలు అయింది. ఇక 2018లో కూడా బీజేపీకి పూర్తి మెజారిటీ దక్కలేదు. ఇతర పార్టీల నుంచి ఎమ్మెల్యేలను ఆకట్టుకుని వారి చేత తరువాత రాజీనామాలు చేయించి వారి మద్దతుతో సంఖ్యాబలం పెంచుకుంది.ఇక 2023లో బీజేపీ గట్టిగానే దెబ్బతింది. కానీ ఎంపీ ఎన్నికల్లో మాత్రం బీజేపీ గెలుస్తోంది. ఆ విధంగా బీజేపీకి కర్ణాటక ఊరటను ఇస్తోంది. తెలంగాణాలో చూస్తే కనీసంగా పాతిక నుంచి ముప్పయి ఎమ్మెల్యేలు గెలుస్తారని అనుకున్నా కేవలం ఎనిమిది మంది మాత్రమే గెలిచారు. అలా బీజేపీ 60 మందితో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్న మ్యాజిక్ ఫిగర్ కి ఎక్కడో ఉంది. అయితే 2024లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో గెలవడం భారీ ఉపశమనంగానే చూడాల్సి ఉంది.ఏపీలో పొత్తు లేకపోతే బీజేపీ సొంత బలం ఒక్క శాతమే ఉంటోంది. 2024లో పొత్తులు కట్టబట్టి ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ముగ్గురు ఎంపీలు ఆ పార్టీకి లభించారు. ఇలా మూడు రాష్ట్రాలలో పరిస్థితి ఉంది. ఇపుడు తమిళనాడు కేరళలలో కూడా తమ ప్రభుత్వాలే వస్తాయని కేంద్ర హోంమంత్రి బీజేపీ పెద్ద అమిత్ షా నమ్మకంగా చెబుతున్నారు.తాజాగా ఆయన కేరళలో పర్యటిస్తూ అక్కడ నిర్వహించిన ఒక సభలో మాట్లాడారు. ఈ సందర్భంగా కేరళలో బీజేపీ ఘన విజయం సాధిస్తుందని అంటున్నారు. బీజేపీకి 2024 ఎన్నికల్లో కేరళలో ఒక ఎంపీ సీటు దక్కింది. దాంతో బీజేపీకి ఆశలు పెరిగినట్లుగా ఉన్నాయని అంటున్నారు.అయితే మొత్తం 20 ఎంపీ సీట్లు ఉంటే బీజేపీకి వచ్చింది ఒకే ఒక్క సీటు అని గుర్తు చేస్తున్నారు. గెలుపు కోసం చాలా దూరం ప్రయాణించా ల్సిందే అని అంటున్నారు. అయితే అమిత్ షా ఒక పోలిక తెస్తున్నారు. ఈశాన్య రాష్ట్రాలలో తమకు పెద్దగా బలం లేకపోయినా తరువాత ఎన్నికల్లో అధికారంలోకి నేరుగా వచ్చామని అంటున్నారు. అలా కేరళలో కూడా తాము ఆశించిన ఫలితాలు వస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేస్తున్నారు.ఇక చూస్తే కనుక 2027లో కేరళ అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతాయి అంటే ఇంకా రెండేళ్ళ సమయం ఉంది అన్న మాట. ఈ రెండేళ్ళలో తాము గట్టిగా ప్రజలలో ఉంటే అధికారం వైపుగా ఆశలు పెంచుకోవచ్చునని బీజేపీ పెద్దలు భావిస్తున్నారులా ఉంది అంటున్నారు అయితే ఒకసారి వామపక్షాల నాయకత్వంలోని ఎల్డీఎఫ్ మరోసారి కాంగ్రెస్ నాయకత్వంలోని యూడీఎఫ్ లను ప్రజలు గెలిపిస్తూ వస్తున్నారు.అక్కడ మూడవ పార్టీకి చాన్స్ అయితే కనిపించడం లేదు అని అంటున్నారు బీజేపీ మాత్రం కేరళలో అడుగుపెట్టి తీరుతామని అంటోంది ఇక తమిళనాడులో చూస్తే అన్నాడీఎంకేతో జత కట్టింది. పొత్తులు కుదుర్చుకుంది. కొంత వరకూ అయితే బలం సమకూరింది. అయితే తమిళనాడులో ఇది సరిపోదనే అంటున్నారు.అక్కడ డీఎంకే బలంగా ఉంది అని చెబుతున్నారు.

## అసెంబ్లీ ఆవరణలో ఆషాడబోనాలు

హైదరాబాద్, శాసనసభ ఆవరణలోని బంగారు మైసమ్మ దేవాలయంలో ఆషాఢ బోనాలు అంగరంగ వైభవంగా జరిగాయి. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం జరిగిన ఆషాఢ మాసం బోనాలలో తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ , శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి , డిప్యూటీ ఛైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్ , లేజిస్లేటివ్ సెక్రటరీ డా. వి నరసింహా చార్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, శాసనసభ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రక్షణ రంగంలో తెలుగు వెలుగులు




న్యూఢిల్లీ,రక్షణ రంగంలో స్వావలంబనకు కేంద్రం చేపట్టిన భారత్‌లో తయారీ విధానాలు సత్ఫలితాలిస్తున్నాయి. ఆయుధ ఎగుమతుల్లో మన దేశం ముఖ్య పాత్రధారిగా అవతరిస్తోంది. ఈ క్రమంలోనే ఏపీ, తెలంగాణాల్లోని రక్షణ పరిశ్రమలు దేశ భద్రత, ఆర్థిక వికాసానికి కీలకమవుతున్నాయి. పెద్దయెత్తున పెట్టుబడులను ఆకర్షిస్తూ ఉపాధికి బాటలు పరుస్తున్నాయి.ఒకప్పుడు ఆయుధ దిగుమతులపై ఆధారపడిన భారత్- నేడు తానే ఎగుమతిదారుగా ఎదగడం విశేష పరిణామం. గత 11 ఏళ్లలో మన రక్షణ ఎగుమతుల విలువ 34రెట్లు పెరిగి, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 23,622 కోట్లకు చేరింది. 2029కల్లా వంద దేశాలకు రూ. 50వేల కోట్ల విలువైన ఆయుధాలను ఎగుమతి చేయాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంది. విధానపరమైన సంస్కరణలు, ప్రైవేటు రంగ భాగస్వామ్యం, అధునాతన సాంకేతికతల వినియోగంతో ఈ దిశగా పరుగులు తీస్తోంది. కొన్ని ఆయుధ వ్యవస్థల ఎగుమతులకు ఓపెన్ జనరల్ ఎక్స్‌పోర్ట్ లైసెన్స్(ఓజీఈఎల్) విధానం ఉపకరిస్తోంది. దానివల్ల పలు ఉపకరణాలను వివిధ దేశాలకు ఎగుమతి చేసే ప్రతిసారీ అనుమతులు తీసుకోవాల్సిన అగత్యం తప్పింది. దాంతో ఎగుమతులు ఊపందుకున్నాయి. ఇతర ఎగుమతులకు వేగంగా అనుమతి ఇవ్వడానికి ప్రత్యేక డిజిటల్ పోర్టల్‌ను తీసుకురావడం మంచి ఫలితాలిస్తోంది. 2024లో ఈ పోర్టల్ ద్వారా 1,507 అనుమతులు లభించగా, ప్రస్తుతం అవి 1762కు చేరాయి. ఇదే కాలంలో రిజిస్టర్డ్ ఎగుమతిదారుల సంఖ్య 17.4శాతం పెరిగింది.

ఆకట్టుకుంటున్న బ్రహ్మోస్

రక్షణ పరిశ్రమలకు లైసెన్సులిచ్చే విధానాన్ని సరళీకరించడంతోపాటు కొన్ని రకాల విడిభాగాలను లైసెన్సింగ్ నుంచి మినహాయించడంబీ అంతర్జాతీయ ఆయుధ ప్రదర్శనల్లో భారత ప్రైవేటు, ప్రభుత్వ రంగ సంస్థలు పాల్గొనడం రక్షణ ఎగుమతుల వృద్ధికి తోడ్పడుతోంది. నేడు అమెరికా, ఆర్మీనియా, ఫ్రాన్స్‌లతో పాటు ఆగ్నేయాసియా, ఆఫ్రికా, దక్షిణ అమెరికా దేశాలకూ భారతీయ ఆయుధాలు, విడిభాగాలు ఎగుమతి అవుతున్నాయి. బులెట్ ప్రూఫ్ దుస్తులు, డార్నియర్ విమానాలు, చేతక్ హెలికాప్టర్లు, ఫాస్ట్ బోట్లు, తేలికపాటి టార్పిడోలు, బాష్ప వాయు లాంచర్లు, సాయుధ కవచ శకటాలు, నైట్ విజన్ సామగ్రి, శత్రు ఆయుధాల ఆచూకీని కనిపెట్టే రాడార్లను భారత్ సరఫరా చేస్తోంది. దాదాపు 160 రకాల ఆయుధాలు, సాంకేతికతలను ఎగుమతి చేయవచ్చని భారత్ గుర్తించింది. వీటిలో 19 ఏరోనాటికల్ సిస్టమ్స్, 41 ఆయుధ వ్యవస్థలు... ఇంకా 4 క్షిపణి వ్యవస్థలు,27 ఎలక్ట్రానిక్, కమ్యూనికేషన్ సిస్టమ్స్, 4 మైక్రోఎలక్ట్రానిక్ సాధనాలు, 28 నౌకాదళ, 16 అణు, జీవ, రసాయన వ్యవస్థలు వంటివి ఉన్నాయి. బ్రహ్మోస్ తదితర క్షిపణులు, ఫిరంగులు, అధునాతన రైఫిల్స్‌తో ప్రపంచ దృష్టిని ఆకర్షించిన భారతదేశం రక్షణోత్పత్తుల్లో కృత్రిమ మేధ(ఏఐ)నూ ఉపయోగిస్తోంది. పాకిస్థాన్ స్థావరాలను 'బ్రహ్మోస్' చిత్తుచేసిన తీరు ఇతర దేశాలను ఆకట్టుకుంటోంది. దీన్ని అడ్డుకునే సత్తా చైనా, పాకిస్థాన్‌లకు లేదని నిరూపితమైంది. ఒక్క నిమిషం వ్యవధిలోనే 300 కిలోమీటర్ల దూరం దూసుకెళ్లి శత్రువు పనిపట్టగల బ్రహ్మోస్‌ను భారత్, రష్యాలు సంయుక్తంగా రూపొందించాయి.

క్షిపణి రాజధాని హైదరాబాద్!

బ్రహ్మోస్ హైపర్ సోనిక్ క్షిపణిని హైదరాబాద్‌లోనే కూర్పు చేస్తున్నారు. ఇక్కడి బ్రహ్మోస్ ఇంటిగ్రేషన్ కాంప్లెక్స్(బీఐసీ)లో క్షిపణిలోని మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ భాగాలను అనుసంధానిస్తున్నారు. భారత్, రష్యాల్లోని ఫ్యాబ్రికేషన్ యూనిట్ల నుంచి వచ్చే భాగాలవి. భారతదేశ క్షిపణి రాజధానిగా పేరుమోసిన హైదరాబాద్‌లో రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీవో)తోపాటు మిధాని, భారత్ డైనమిక్స్ లిమిటెడ్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలూ... ఎల్‌అండ్‌టీ, అదానీ ఎల్బిట్ వంటి ప్రైవేటు కంపెనీలూ రక్షణ ఉత్పత్తుల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయి. మరెన్నో స్టార్టప్‌లు, రీసెర్చ్ ల్యాబ్‌లు, ఎంఎస్‌ఎంఈలు ఆయుధాలు, డ్రోన్ల ఉత్పత్తిలో నిమగ్నమయ్యాయి. ఇక్కడ రక్షణ పరిశ్రమలకు కావాల్సిన నిపుణ సిబ్బంది కూడా అందుబాటులో ఉన్నారు. తెలంగాణలో ఏరోస్పేస్, రక్షణోత్పత్తి పార్కుల స్థాపన ఆయుధ పరిశ్రమలకు ఊతమిస్తోంది. హైదరాబాద్-బెంగళూరు రక్షణ కారిడార్ వేగంగా సిద్ధమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం మహబూబ్‌నగర్ జిల్లాలోని దేవరకద్రలో బ్రహ్మోస్ క్షిపణి తయారీ యూనిట్ స్థాపనకు చర్యలు తీసుకుంటోంది. ఈ యూనిట్ విస్తీర్ణాన్ని 300-400 ఎకరాలకు పెంచుతోంది. సికింద్రాబాద్‌లోని ఐఎన్ఎస్ శాంతి నౌకాదళ కేంద్రం పశ్చిమ, తూర్పు నావల్ కమాండ్‌లకు కీలక సేవలు అందిస్తోంది. దుండిగల్ ఎయిర్ ఫోర్స్ అకాడమీ వైమానిక సిబ్బందికి శిక్షణ కేంద్రంగా నిలుస్తోంది.

పెట్టుబడులకు ఏపీ స్వాగతం...

విశాఖపట్నం తూర్పు నౌకాదళ కేంద్రంగా భాసిల్లుతోంది. ఇక్కడ నేవీ సిబ్బందికి యుద్ధ నౌకలు, జలాంతర్గాముల నిర్వహణలో శిక్షణ ఇస్తున్నారు. విశాఖ హిందుస్థాన్ షిప్‌యార్డ్‌లో 1941 నుంచే నౌకలు తయారవుతున్నాయి. బంగాళాఖాతం, హిందూ మహాసముద్రాల్లో నౌకల సంచారాన్ని విశాఖ నావల్ కమాండ్ పర్యవేక్షిస్తోంది. ఏపీలో 23రక్షణ, ఏరోస్పేస్ కంపెనీలు ఉన్నాయి. రూ. 22 వేల కోట్ల పెట్టుబడులతో కొనసాగుతున్న ఈ సంస్థలు 17వేల మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. చంద్రబాబునాయుడి ప్రభుత్వం 2025-30 మధ్య కొత్త ఏరోస్పేస్, రక్షణ విధానం కింద లక్ష కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడులను ఆకర్షించాలని లక్షిస్తోంది. ఈ విధానం కింద అయిదు క్లస్టర్లలో డిఫెన్స్, ఏరోస్పేస్ పరిశ్రమల ఏర్పాటుకు తోడ్పాటు అందిస్తారు. విశాఖపట్నం-శ్రీకాకుళం మధ్య నౌకాదళ క్లస్టర్లుబీ జగ్గయ్యపేట, దొనకొండలలో క్షిపణి, మందుగుండు తయారీ క్లస్టర్లుబీ కర్నూలు-ఓర్వకల్, లేపాక్షి-మడకశిరలలో ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్ క్లస్టర్లను అభివృద్ధి చేయాలన్నది ఆలోచన. తిరుపతిని రక్షణ పరిశోధన-అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దుతారు. ఇలా తెలుగు రాష్ట్రాల్లోని రక్షణ పరిశ్రమలు దేశ భద్రత, ఆర్థిక వికాసంలో కీలక భాగస్వాములుగా అవతరిస్తున్నాయి.

# ప్రజల్లో ఆదరణ కోల్పోయిన పార్టీలు..ఆ ఇద్దరినీ ప్రజలు ఆదరించడం కష్టమే

హైదరాబాద్, ప్రజల్లో ఆదరణ కోల్పోతున్నా..ఎదురుదాడి విమర్శలతో పాతకాపులు మళ్లీ బయలుదేరారు. రాష్ట్రాలను అప్పులకుప్పగా మార్చి, కుటుంబ సక్షేమమే ప్రజల సంక్షేమంగా మార్చిన నేతలు మళ్లీ ప్రజల్లో ఆదరణ కోసం నానా తంటాలు పడుతున్నారు. తెలుగు రాష్ట్రాలను ఒకప్పుడు నిరంకుశంగా ఏలిన జగన్, కెటిఆర్‌లు సుద్దులు చెబుతున్నారు. అటు అధికారం లేక, ఇటు విపక్షంగా రాణించలేక, మిగతా విపక్షాలతో కలవలేక విసిరివేయబడ్డ వీరు ఉనికి కోసం నానా తంటాలు పడక తప్పడం లేదు. వీరి చరిత్ర చూస్తే మరోమారు వీరికి ప్రజలు అధికారం కట్టబెడతారన్న నమ్మకం మాత్రం లేదు. జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పాలనుకుని నానా హడావిడి చేసిన కెసిఆర్ ఇప్పుడు ఒంటరి అయ్యాడనే చెప్పాలి. విపక్ష పార్టీలు కూడా కెసిఆర్‌తో కలవాలని కానీ లేదా కలుపుకోవాలని కూడా కోరుకోవడం లేదు. ఈ కోవలోజగన్ కూడా ఉన్నారు. బిఆర్ఎస్ ఏర్పాటు తరవాత అడపాదడపా మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో మాత్రం కెసిఆర్ కొంత హడావిడి చేశారు. కెసిఆర్ గతంలో కలసి చర్చించిన విపక్ష నేతలంతా ఇప్పుడు కెసిఆర్ వైపు చూడడం లేదు. వారంతా కాంగ్రెస్‌కు దగ్గరగా కూటమిలో ఉన్నారు. అలా కొందరు అధికార బిజెపికి దగ్గరగా కూడా వున్నారు. మొత్తానికి ప్రజలతో పాటు, ఇతర పార్టీలు కూడా కెసిఆ÷-ను, జగన్‌లను దూరం పెట్టారు. నితీశ్ కుమార్ వ్యూహాత్మకంగా బిజెపికి దగ్గరయి ఎన్‌డిఎలో భాగస్వామి అయ్యారు. జగన్, కెసిఆర్‌లను బిజెపి కోవర్టులుగా మిగతా పార్టీల నేతలు భావిస్తున్నారు. అందుకే బిజెపికి వ్యతిరేక కూటమిలో వీరికి స్థానం దక్కడంలేదు. ఈ క్రమంలో జాతీయ పార్టీని ఏర్పాటు చేసి జాతీయ రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషించాలనుకున్న కేసీఆర్ అధికారం పోవడంతో పాటు, ఉన్న నేతలంతా జారుకోవడంతో ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ఏకాకి అయ్యారు. కేవలం ఫామ్‌హౌజ్‌కు పరిమితం అయ్యారు. ప్రజల్లోకి వచ్చి పోరాటాలు చేసే ప్రయత్నాలు కూడా చేయడం లేదు. ఆయన బాధ్యతలను ఇప్పుడు కొడుకు కెటిఆర్, అల్లుడు హరీష్, కూతురు కవితలు మోస్తున్నారు. తన నాయకత్వం కోసం దేశమంతా ఎదురుచూస్తోందని తెలంగాణ ప్రజలను నమ్మించే ప్రయత్నాలను గతంలో ముమ్మరం చేసినప్పుడు కూడా కెసిఆర్‌ను ప్రజలు నమ్మలేదు, రైతులు, రైతు నాయకుల పేరిట ఆ మధ్య ఉత్తరాదికి చెందిన కొంతమందిని సొంత ఖర్చులతో రప్పించుకొని అతిథి మర్యాదలు చేసి వారంతా తన నాయకత్వాన్ని కోరుకుంటున్నారని ప్రకటించారు. కాలం చెల్లిన కొందరు నేతలు వచ్చి కెసిఆర్‌ను కలిశారు. ఇప్పుడిదంతా చూస్తుంటే కెసిఆర్ భావి ప్రధాని కాబోతున్నారన్న హడావిడి చేశారు. కానీ ఇప్పుడు సీన్ రివర్స్ అయ్యింది. కర్ణాటకలో కుమారస్వామికి బలం లేదని మొన్నటి ఎన్నికల్లో ప్రజలు తేల్చేశారు. దీంతో ఆయన ఉనికి కోసం బిజెపి పంచన చేరి కేంద్రమంత్రి అయ్యారు. కేసీఆర్ నాయక త్వాన్ని అంగీకరించి ,ఆయన నాయకత్వంలో ప్రతిపక్షాలను ఏకం చేయడానికి జరిగిన ప్రయత్నాలు బెడిసి కొట్టాయి. కెసిఆర్ దేశానికి ప్రధానమంత్రి ఎందుకు కాకూడదని బిఆర్ఎస్ నేతలు ఊరూరా ప్రచారం చేసి బొక్కబోర్లా పడ్డారు. కెసిఆర్ రంగు తెలియడంతో ఎన్నికలకు ముందే కమ్యూనిస్టులు కూడా జారుకున్నారు. అయితే ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమంటే.. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా జాతీయ స్థాయిలో కూడా కమ్యూనిస్టులు పూర్తిగా బలహీనపడ్డారు. బెంగాల్లో కూడా ఎక్కడా పెద్దగా ప్రభావం లేదు. ఒకప్పుడు కమ్యూనిస్టులకు పెట్టని కోటగా ఉన్న పశ్చిమబెంగాల్లో ఇప్పుడు ఆ పార్టీ ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఈ తొమ్మిదేళ్లలో కేసీఆర్‌కు ఎంతో మంది ఆప్తులను, ఉద్యమనేతలను దూరం పెట్టారు. కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీతో పోల్చితే ప్రతిపక్షాలన్నీ ఆర్థికంగా బలహీనంగా ఉన్నాయి.ఉ




చిత విద్యుత్, ఉచిత మంచినీరు వంటి నినాదాలతో దేశ ప్రజలు అందరినీ తన వైపు తిప్పుకో గలనని కేసీఆర్ నమ్మారు. అందుకే అబ్ కీ బార్ కిసాన్ సర్కార్ అన్న నినాదం లేవనెత్తారు. దేశవ్యాప్తంగా రైతులకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తామని తాను చేసిన ప్రకటనకు విశేష స్పందన వచ్చిందని ప్రచారం చేయించుకున్నారు. మొత్తంగా మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో జీరోతో డకౌట్ అయ్యారు. ఇప్పుడు మరోమారు తెలంగాణ సెంటిమెంట్‌తో ప్రజలను నమ్మించవచ్చని అనుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో సెంటిమెంట్ ఇక ఏ మాత్రం పనికిరాదని కెసిఆర్ గ్రహించలేక పోయారు. కెసిఆర్ పాలనలో తెలంగాణ ప్రజల ఆకాంక్షలు పెద్దగా నేరవేర లేదనే అభిప్రాయం చాలా మందిలో బలపడింది. అందుకే కెసిఆర్‌ను ఓడించారు. ఎపిలోనూ జగన్ స్వయంకృతంతో దెబ్బతిన్నారు. వైకాపా అధినేత, ఎపి మాజీ సిఎం మారోమారు ప్రజలతో మమేకం కావాలని చూస్తున్నారు. రైతులకు పరామర్శల పేరుతో అలజడి సృష్టిస్తున్నారు. ప్రజల ప్రాణాలు పోతున్నా పట్టించుకోవడం లేదు. రాజకీయం చేయడం ద్వారా పబ్బం గడుపుకుని , మళ్లీ ప్రజల్లో సానుభూతి కోసం యత్నిస్తున్నారు. ఈ క్రమంలో తనతో పాటు, పార్టీ నేతలు అనవసర రాద్ధాంతం చేస్తూ దుమ్మెత్తి పోయడం అలవాటుగా చేసుకున్నారు. గతంలో పాదయాత్రతో నేనున్నాను...నేను విన్నాను అని నమ్మబలికి నట్టేట ముంచినందుకు ..ప్రజలు తగిన గుణపాఠం చెప్పారు. మీరు వినలేదని గుర్తించామని ప్రజలు చెప్పారు. పక్కనే ఉన్న అమరావతి రైతులు ఐదేళ్లుగా ఆందోళనలు చేసినా ఏ ఒక్కనాడూ పలకిరించిన పాపాన పోలేదు. రాష్ట్రంలో రాక్షస రాజ్యం నడిపిస్తూ దోపిడీలు చేస్తున్నా మిన్నాకున్నారు. ఈ క్రమంలో అధికారం పోవడంతో జ్ఞానోదయం అయిన జగన్ ఇప్పుడు మళ్లీ ప్రజలకు చేరువ కావాలని చూస్తున్నారు. ప్రజలతో మమేకం అయ్యేందుకు సిద్ధమవుతున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి తర్వాత పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో సమావేశమైన ఆయన పార్టీ ఓటమి సంబంధించి నేతలకు భరోసాను కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజలకు మంచి చేశామని, కానీ ఎందుకో ఓడిపోయామంటూ వెల్లడించారు. ప్రజల్లో ఉంటూ ప్రజలకు మంచి చేసే ప్రయత్నం చేయడం ద్వారా మళ్ళీ అధికారాన్ని దక్కించుకుంటామన్న భరోసాను కల్పించారు. ఆ ప్రకాశం, పల్నాడు, చిత్తేరు. పులివెందులలోనూ జగన్ పర్యటించారు. మొన్నటి వరకు తాడేపల్లి చుట్టూ ముళ్ల కంచెలను నిర్మించారు. ఎవరు కూడా చూడడానికి కూడా రాకుండా చేసుకున్నారు. అధికారం పోవడంతో ఇక ప్రజల అవసరం తెలిసి వచ్చినట్లు ఉంది. ప్రతిరోజు ప్రజలను కలిసేందుకు జగన్ క్యాంపు కార్యాలయంలో ప్రత్యేకమైన ఏర్పాట్లను చేయించారు. అధికారంలో ఉండగా వివిధ కేసుల్లో ఇరుక్కున్న వారిని న్యాయపరమైన, ఆర్థిక పరమైన సహకారాన్ని అందించేందుకు అనుగుణంగా చర్యలు తీసుకునేలా హామీ ఇస్తున్నారు. ఈ ఇద్దరూ రాజకీయంగా కోలుకోవడం ఇప్పుడు కష్టమనే చెప్పాలి.

# నదుల అనుసంధానానికి ఆద్యులు కెఎల్ రావు

విజయవాడ, ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నదుల అనుసంధానానికి శ్రీకారం చుట్టారని.. అయితే 50 ఏళ్ల క్రితమే నదుల అనుసందానికి నాంది పలికింది కేఎల్ రావు అని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు గుర్తు చేసుకున్నారు.కేఎల్ రావు స్ఫూర్తిని ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు కొనసాగిస్తున్నారని తెలిపారు. నాగార్జున సాగర్, శ్రీశైలం, హిరాకుడ్ సహా దేశంలో అత్యంత భారీ ప్రాజెక్టుల నిర్మాణానికి కేఎల్ రావు శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. ప్రఖ్యాత ఇంజినీర్ కేఎల్ రావు తెలుగువారు కావడం గర్వకారణమని కొనియాడారు. ప్రఖ్యాత ఇంజినీర్ డాక్టర్ కేఎల్ రావు 124వ జయంతి సందర్భంగా కేఎల్ రావు చిత్రపటానికి మంత్రి నిమ్మల నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కరవుతో వచ్చే దుర్భిక్ష పరిస్థితులు పారద్రోలాలంటే నదుల అనుసందానమే మార్గమని స్పష్టం చేశారు. ఏటా 3 వేల టీఎంసీల వరద నీరు సముద్రంలోకి పోకుండా పోలవరం ప్రాజెక్టును చంద్రబాబు నిర్మిస్తున్నారని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పోలవరం ప్రాజెక్టు విధ్వంసానికి గురైందని మండిపడ్డారు. ప్రశ్నార్థకమైన పోలవరం ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం గాడిలో పెట్టిందని అన్నారు. 2027 డిసెంబర్ కల్లా పోలవరం ప్రాజెక్టును పూర్ తిచేయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని స్పష్టం చేశారు. పట్టిసీమ కాదు.. వట్టిసీమ అని గతంలో శాసనసభలో జగన్ అవహేళన చేశారని.. చంద్రబాబు కృషి పట్టు-దలతో పట్టిసీమ పూర్తి చేయడంతో కృష్ణాడెల్టా సస్యశ్యామలం అవుతోందని వెల్లడించారు. ఈ ఏడాది కృష్ణా డెల్టాలో వర్షాలు ఆశించినంతగా కురవలేదన్నారు. ఎగువ ప్రాజెక్టులు నిండకపోయినా పట్టిసీమ నీరుతో కృష్ణా డెల్టా కళకళలాడుతోందని చెప్పుకొచ్చారు. విజయవాడలో నీలం రంగులో ప్రవహించే కృష్ణమ్మ .. గోదారమ్మ కలవడంతో ఎరుపురంగు పులుముకుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ సాగునీటి ప్రాజెక్టులపై తీవ్ర నిర్లక్ష్యం వహించిందని విమర్శించారు. గత ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల గేట్లకు కనీసం గ్రీజు కూడా పెట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస నిర్వహణ లేకపోవడంతోనే గతంలో పులిచింతల గేట్లు- కొట్టు-కుపోయాయని వ్యాఖ్యలు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సాగునీటి ప్రాజెక్టులను నిర్వహణ, మరమ్మతులకు నిధులిచ్చామన్నారు. ప్రజలిచ్చిన అధికారంతో ఒళ్లు దగ్గర పెట్టు-కుని పనిచేస్తున్నామన్నారు. ఈ ఏడాదిలో ఉత్తరాంధ్రకు పోలవరం ద్వారా నీరు తీసుకురావడమే లక్ష్యమని స్పష్టం చేశారు. హంద్రీనీవా ప్రవాహం 2100 క్యూసెక్కుల నుంచి 3850 క్యూసెక్కుల ప్రవాహం పెంచేలా ఏడాదిలోనే కాలువలు వెడల్పు చేశామన్నారు. స్ఫూర్తి నిచ్చేలా పనిచేయడమే కెఎల్ రావుకు ఇచ్చే ఘనమైన నివాళి అని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.

## రక్తం కక్కుతారనడం దేనికి సంకేతం?

హైదరాబాద్,ప్రతి ఏడాది ఆషాఢం సందర్భంగా తెలంగాణలో బోనాల పండుగ జరుగుతుంది. ముఖ్యంగా హైదరాబాదులో బోనాల పండుగ అంగరంగ వైభవంగా జరుగుతుంది. గోల్కొండ బోనాలతో మొదలైన వేడుక ఉజ్జయిని మాతకు సమర్పించే బోనాలతో ముగుస్తుంది. ఉజ్జయిని బోనాల సందర్భంగా స్వర్ణలత భవిష్యవాణి చెబుతుంది. భవిష్యవాణి చెప్పే సమయంలో స్వర్ణలతను అమ్మవారు ఆవహిస్తారని భక్తులు అంటుంటారు. ఆ సమయంలో ఆమె చెప్పే మాటలు భవిష్యత్తు కాలాన్ని సూచిస్తాయని నమ్ముతుంటారు.ఉజ్జయిని మహంకాళి బోనాల సందర్భంగా స్వర్ణలత భవిష్య వాణి చెప్పారు. ఆ సమయంలో స్వర్ణలత ఎంతో ఉద్రేకంగా ఉంటారు. అమ్మవారిని తలుచుకుంటూ పూనకాలు ఊగుతారు. ఆ తర్వాత రంగం చెబుతారు. భవిష్యవాణి చెప్పుకుంటూ.. జాగ్రత్తగా ఉండాలని సూచిస్తారు. ఈసారి భవిష్యవాణిలో స్వర్ణలత ఆగ్రహంగా మాట్లాడారు. తనకు రక్తం రుచి కొంతైనా చూపించాలని ఆమె భక్తులను కోరారు.. భక్తులు తనను మర్చిపోకూడదని.. తనను శాంతింపజేయాలని.. తన రూపాన్ని కొలుచుకుంటూ ఉండాలని స్వర్ణలత భక్తులకు సూచించారు. ఇన్ని సంవత్సరాలుగా కాపాడుకుంటూ వస్తున్నప్పటికీ.. మర్చిపోయారని.. ఏడు సంవత్సరాల పొద్దు నుంచి తనను అంతగా పట్టించుకోవడంలేదని స్వర్ణలత దుఃఖపూరిత స్వరంతో వ్యాఖ్యానించారు. ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని.. ద్వేషం పెంచుకుంటే అనర్థాలు మిగులుతాయని.. వాటి వల్ల సాధించేది ఏదీ ఉండదని స్వర్ణలత పేర్కొన్నారు.. సంస్కృతిని మర్చిపోవద్దని.. సంప్రదాయాన్ని దూరం చేసుకోవద్దని.. అప్పుడు మనిషిగా అన్నిటికి దూరమవుతారని స్వర్ణలత పేర్కొన్నారు.ఉండాల్సిన పద్ధతులు.. పాటించాల్సిన నిబంధనల గురించి వివరించిన స్వర్ణలత.. మహమ్మారి గురించి కూడా హెచ్చరించారు. వచ్చే రోజుల్లో మహమ్మారి పొంచి ఉందని.. జాగ్రత్తగా ఉండాలని.. స్వర్ణలత సూచించారు.." విపత్తు పొంచి ఉంది. ఏ రూపంలో నుంచి వస్తుందో తెలియదు. జాగ్రత్తగా ఉండాలి. పద్ధతిగా బతకాలి. మితిమీరిన స్వేచ్ఛ వద్దు. అడ్డగోలుగా ఉండకూడదు. పరిధిలో జీవించాలి.. వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలి. అత్యాశ వద్దు. స్వార్థాన్ని ప్రదర్శించవద్దు. దురాశను దూరం చేసుకోవాలి. ప్రేమతోనే అన్నింటికీ దగ్గర అవ్వాలి. భక్తి భావాన్ని మరింత పెంచుకోవాలి. అమ్మలను కొలవాలి. అద్భుతమైన జీవితాన్ని సాకారం చేసుకోవాలని" స్వర్ణలత సూచనలు లాంటి హెచ్చరికలు చేశారు. స్వర్ణలత భవిష్యవాణి వినిపించిన నేపథ్యంలో వచ్చే ఆ ఉపద్రవం ఏంటి.. దానివల్ల ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది.. అనే చర్చ తెలంగాణ వ్యాప్తంగా మొదలైంది. మరోవైపు కోవిడ్ ముందు కూడా స్వర్ణలత ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. మళ్లీ ఇన్ని సంవత్సరాల తర్వాత స్వర్ణలత అలాంటి హెచ్చరికలు చేయడం కలకలం రేపుతోంది.. భవిష్యవాణి చెబుతున్న సమయంలో స్వర్ణలత రక్తం కక్కుకుంటూ చనిపోతారని హెచ్చరించడం ఆందోళన కలిగిస్తోంది. నిజానికి రక్తం కక్కుకుంటూ చనిపోవడం అంటే రోడ్డు ప్రమాదాలు జరుగుతాయా? ఏదైనా ఊహించని ఉపద్రవాలు చోటు చేసుకుంటాయా? అవి వ్యాధుల రూపంలో వస్తాయా? ప్రమాదాల రూపంలో వస్తాయా? అనే ప్రశ్నలు వ్యక్తం అవుతున్నాయి. వాస్తవానికి పూర్వకాలంలో కలరా, ఇతర వ్యాధులు ప్రబలినప్పుడు ప్రజలు రక్తం కక్కుకుంటూ చనిపోయే వారట..

## డిప్యూటీ సిఎం భట్టికి బిజెపి అధ్యక్షుడు లీగల్ నోటీసులు

హైదరాబాద్,తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు షాక్ ఇచ్చారు. రోహిత్ వేముల ఆత్మహత్యపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు గానూ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు లీగల్ నోటీసులు పంపించారు. బేషరతుగా మూడు రోజుల్లో క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. క్షమాపణలు చెప్పని పక్షంలో క్రిమినల్ కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుందని.. 25 లక్షలకు పరువు నష్ట దావా వేస్తానని హెచ్చరించారు. గతంలో కోర్టు ఇచ్చిన తీర్పు కాపీని బీజేపీ చీఫ్ తరపు న్యాయవాది అటాచ్ చేశారు. నాలుగు రోజుల క్రితం ఢిల్లీలో డిప్యూటీ- సీఎం మల్లు భట్టివిక్రమార్క బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుపైన సంచలన ఆరోపణలు చేశారు. ఏఐసీసీ హెడ్ క్వార్టర్స్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సెంట్రల్ యూనివర్సిటీ-ల స్థితిగతులపై మాట్లాడుతూ.. హెచ్‌సీయూ లో విద్యార్థుల ఉద్యమాన్ని అణిచివేసేందుకు ప్రస్తుత రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు ప్రయత్నించారని ఆరోపించారు. బీజేపీ అధిష్ఠానం తెలంగాణ నూతన అధ్యక్షుడిగా రాంచందర్‌రావును ఎంపిక చేయడాన్ని తప్పుపడుతూ.. రోహిత్ వేముల హత్యకు కారకులైనవారికి బీజేపీ ప్రమోషన్లు ఇస్తోందంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.

# ఇద్దరూ ఇద్దరే..గవర్నర్ల నియామకంలో 'ఉత్తరాంధ్ర' మార్క్!



అమరావతి,ఉత్తరాంధ్రకు అరుదైన గౌరవం దక్కింది. విజయనగరం సంస్థానాధీశుడు, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు గవర్నర్గా నియమితులయ్యారు. సాధారణంగా గవర్నర్లుగా పనిచేసే అవకాశం కొంతమందికి మాత్రమే లభిస్తుంది. సాధారణంగా రాజకీయాల్లో ఉన్నవారు, అన్ని పదవులు అనుభవించిన వారు.. గౌరవప్రదమైన పదవీ విరమణ కోరుకుంటారు. అటువంటి వారు ఎక్కువగా రాజ్యాంగబద్ధ పదవి అయిన గవర్నర్ పదవి చేపట్టాలని భావిస్తుంటారు. ప్రస్తుతం యాక్టివ్ రాజకీయాలకు దూరంగా ఉన్నారు అశోక్ గజపతిరాజు. ఆయన చేయని పదవి అంటూ లేదు. ఎమ్మెల్యేగా, ఎంపీగా, మంత్రిగా,కేంద్ర మంత్రిగా దాదాపు అన్ని పదవులు నిర్వర్తించారు. ఇప్పుడు గవర్నర్ బాధ్యతలు చేపట్టనున్నారు.

బిజెపి ద్వారా ఎంట్రీ

ఉత్తరాంధ్రలో మొదటిగా గవర్నర్గా పదవి చేపట్టినది మాత్రం కంభంపాటి హరిబాబు. హరిబాబు ఆంధ్ర యూనివర్సిటీలో చదువుకోవడానికి వచ్చి.. అక్కడే అధ్యాపకుడిగా పనిచేశారు. తెన్నేటి విశ్వనాథం, సర్దార్ గౌతు లచ్చన్న, వెంకయ్య నాయుడుల పరిచయంతో రాజకీయాల్లోకి వచ్చారు. బిజెపిలో కీలకంగా పనిచేశారు. 1999లో విశాఖ 1 నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచారు. 2014లో బిజెపి అభ్యర్థిగా విశాఖ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేశారు. జగన్ తల్లి విజయమ్మ పై విజయం సాధించారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు గాను కొనసాగారు. 2021 జూలై 19న ఆయనను గవర్నర్గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం ఆయన ఒడిస్సా గవర్నర్ గా నియమితులు అయ్యారు.

టిడిపికి ప్రాధాన్యం..

తాజాగా గవర్నర్ నియామకంలో తెలుగుదేశం పార్టీకి ప్రాధాన్యం ఇచ్చింది కేంద్ర ప్రభుత్వం. ఎన్డీఏ భాగస్వామ్య పక్షం కావడంతో తెలుగుదేశం పార్టీకి ఈ అవకాశం దక్కింది. ప్రస్తుతం ఎన్డీఏలో బిజెపి తర్వాత అతిపెద్ద పార్టీ టిడిపి. అందుకే మిత్రులు తెలుగుదేశం పార్టీకి ఈ అవకాశం కల్పించారు బిజెపి పెద్దలు. ఐదేళ్లపాటు అశోక్ గజపతిరాజు గవర్నర్ పదవిలో కొనసాగుతారు. అశోక్ నియామకంపై టిడిపి కూటమి శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. ఉత్తరాంధ్ర నుంచి గవర్నర్గా ఎంపికైన రెండో వ్యక్తిగా అశోక్ గజపతిరాజు గుర్తింపు సాధించారు. అశోక్ గజపతిరాజు వివాద రహితుడు. ఆపై అవినీతి మరకలేని వ్యక్తి. కంభంపాటి హరిబాబు సైతం మృదుస్వభావి, బిజెపిలో అంచలంచెలుగా ఎదుగుతూ ఈ స్థాయికి వచ్చారు. ఈ ఇద్దరు వ్యక్తులు రాజ్యాంగబద్ధ పదవి అయిన గవర్నర్ గా నియమితులై ఉత్తరాంధ్రాకు వన్నె తెచ్చారు.

# రాజ్‌భవన్‌కు రిజర్వేషన్ల ఆర్డినెన్స్ .. వెనక్కి వస్తుందా?

హైదరాబాద్,స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు 42 శాతం వరకూ పెంచాలని తెలంగాణ ప్రభుత్వం పట్టుదలగా ఉంది. చట్టపరమైన అన్ని అవకాశాలను పరిశీలించి.. ఎంతో కొంత అవకాశం ఉందని భావిస్తూ .. ఆర్డినెన్స్‌కు మొగ్గి చూపింది. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం, 2018లో సవరణలు చేసే ఆర్డినెన్స్ సిద్ధం చేసి రాజ్ భవన్‌కు పంపింది. గవర్నర్ సంతకం చేస్తే.. వెంటనే రిజర్వేషన్లు కల్పించి ఎన్నికలు నిర్వహించేయవచ్చు. న్యాయపరమైన సమస్యలు కూడా వచ్చే అవకాశం ఉంది. అయితే గవర్నర్ సంతకం పెడతారా లేదా అన్నదే సమస్య.ర్డినెన్స్ జారీ చేస్తే రాజ్యాంగపరమైన సమస్యలు వస్తాయని నిపుణులు ఇప్పటికే తేల్చారు. సుప్రీం కోర్టు రిజర్వేషన్ల మొత్తం పరిమితిని 50 శాతంగా నిర్దేశించింది. ఆర్డినెన్స్ జారీ చేస్తే తెలంగాణలో మొత్తం రిజర్వేషన్లు 70 శాతం దాటిపోతాయి. ఈ అంశం ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం ఇవ్వడంలో అడ్డంకిగా మారవచ్చని చెబుతున్నారు. అదే సమయంలో రాష్ట్రపతి ముందస్తు ఆమోదం అవసరమయ్యే విషయాలపై గవర్నర్ ఆర్డినెన్స్‌ను జారీ చేయరని భావిస్తున్నారు. గవర్నర్ పై ప్రభుత్వ ఒత్తిడి ఉంటే.. ఆయన న్యాయపరిశీలనకు పంపే అవకాశాలు కూడా ఉంటాయి.రాజ్ భవన్ నుంచి ఇప్పుడు బిల్లు బయటకు రావడమే అత్యంత కీలకం. గవర్నర్ సంతకంతో వస్తే.. ప్రభుత్వం సక్సెస్ అయినట్లే. సీఎం రేవంత్ రెడ్డి ఆర్డినెన్స్ జారీకి ముందు



ఎలాంటి కసరత్తు చేయలేదని అనుకోలేం. ఆయన న్యాయపరంగా ఉండే కొన్ని అవకాశాల్ని ఉపయోగించుకునే .. ఆర్డినెన్స్ సిద్ధం చేయించారన్న అభిప్రాయం వినిపిస్తోంది. ఈ విషయంలో ప్రభుత్వ వాదనలకు గవర్నర్ సంతృప్తి చెందితే .. ఆర్డినెన్స్ జారీ ఏవుతుంది. లేకపోతే వివాదమవుతుంది. స్థానిక ఎన్నికల నిర్వహణ మరోసారి రిస్క్ లో పడుతుంది.

# కవిత.. కలసి ఉంటేనే కలదు బలం !



హైదరాబాద్,తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఇప్పుడు తన రాజకీయ జీవితంనే కాదు.. వ్యక్తిగత జీవితంలోనూ అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్ని ఎదుర్కొంటున్నారు. తీన్మార్ మల్లన్నతో వివాదం తర్వాత ఆమెకు మద్దతుగా ఎవరూ రాలేదు. కాంగ్రెస్ నేతలు అటు కవితది%'ొ% ఇటు మల్లన్నది ఇద్దరిదీ తప్పేనని వాదిస్తూ తెరపైకి వచ్చారు. బీఆర్ఎస్ నేతలు ఆ పని కూడా చేయలేదు. అసలు ఆ టాపిక్ పై స్పందించలేదు. కవిత మాత్రమే ఒంటరి పోరాటం చేస్తున్నారు. తనపై మల్లన్న చేసినవి హేయమైన మాటలని.. ఆయనపై చర్య తీసుకోవాల్సిందేనని అంటున్నారు.

కవితకు కనిపించని మద్దతు

సాధారణంగా కవితపై ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే.. పరిస్థితులు సీరియస్ గా మారుతాయి. ఆ నేతపై విమర్శలు పెరగాలి. అనూహ్యంగా .. తీన్మార్ మల్లన్నపై అంత తీవ్రమైన వ్యతిరేక కామెంట్లు రాలేదు. ఆయన తన మాటల్ని సమర్థించుకున్నారు. కేసీఆర్ విడుదల చేసిన సామెతల పుస్తకంలోనే ఉందని నిరూపించుకున్నారు. కానీ సామెతల్ని వాడేటప్పుడు సమయం, సందర్భం కలసి రావాలి.. లేకపోతే దురార్థాలు వచ్చేస్తాయి. ఇప్పుడు అదే జరిగింది.

బాధితురాలిగా మారిన కవితకు.. సానుభూతి రావాలి ..కానీ రావడం లేదు. దీనికి కారణం పూర్తిగా సొంత దారిలో వెళ్తున్న ఆమె రాజకీయమే.

కుటుంబమే బలం- వద్దనుకుంటే ఎలా ?

కల్వకుంట్ల కవితకు అసలు బలం కుటుంబం, బీఆర్ఎస్ పార్టీనే బలం. పార్టీని కూడా కుటుంబమే అనుకోవాలి. అలాంటి బలాన్ని కాదనుకుని కవిత సొంత రాజకీయాలు చేస్తున్నారు. కేటీఆర్ నాయకత్వాన్ని అంగీకరించబోనని ప్రకటించారు. కానీ కేసీఆర్ నాయకత్వంలో వచ్చే ఎన్నికల్లో స్వీప్ చేస్తామని చెబుతున్నారు. అయితే ఆమె మాటలు పార్టీ హైకమాండ్, తండ్రి అయిన కేసీఆర్ ను సంతృప్తి పరచలేకపోతున్నాయి. ఆయన కవితపై ఆగ్రహంతోనే ఉన్నారు. ఫామ్ హౌస్ తలుపులు తెరవడం లేదు. మాట్లాడటం లేదు కూడా. కేసీఆర్ విధానం తెలిసిన తర్వాత ఇతర పార్టీ నేతలెవరైనా భిన్నంగా ఎలా స్పందిస్తారు%'ొ%?. అందుకే తీన్మార్ మల్లన్నతో వివాదంపై బీఆర్ఎస్ స్పందించలేదు. అంటే కవిత తన పార్టీ బలాన్ని%'ొ% కుటుంబ బలాన్ని వదులుకున్నారు. ఒంటరిగా మారి రాజకీయంగా బలహీనపడ్డారు.

కవితకు ఇప్పుడు దారేంటి ?

కవిత ఇప్పుడు చాలా దూరం ముందుకెళ్లారు. తెలంగాణ జాగృతిని విస్తృత పరిచారు. బీఆర్ఎస్ లోనే ఉన్నానని తాను చెబుతున్నారు కానీ..ఆ పార్టీ వాళ్ల అంగీకరించడం లేదు. కవితను పట్టించుకునేది లేదని జగదీష్ రెడ్డి లాంటి వాళ్లు చెబుతున్నారు. ఏ మాత్రం స్పందించకపోవడమే బీఆర్ఎస్ విధానం అనుకోవచ్చు. కానీ కవిత తమ పార్టీ బీఆర్ఎస్..తమ నాయకుడు కేసీఆర్ అంటున్నారు. ఇప్పుడు మళ్లీ కుటుంబంతో, పార్టీతో సత్సంబంధాలు పెంచుకోవాలంటే.. కవితనే తగ్గాల్సి ఉంటుంది. అలా తగ్గితే ఆమె రాజకీయాల నుంచి వైదొలగాలని షరతు పెట్టే అవకాశం ఉంది. అలాంటి పరిస్థితి రాకుండా చూసుకోవాల్సింది. కానీ సొంత రాజకీయం ప్రారంభించడంతో అందరి మద్దతు కోల్పోయారు. ఇక ఒంటరిగానే ముందుకెళ్లక తప్పని పరిస్థితి కవితకు కనిపిస్తోందని రాజకీయవర్గాలు అంచనా వేస్తున్నాయి.

# అహ్మదాబాద్ ప్రమాదం తర్వాత నిలిచిన విమానాలు పునరుద్ధరణ..

న్యూఢిల్లీ,అహ్మదాబాద్ విమాన ప్రమాదం దేశంతో పాటు ప్రపంచాన్ని కలవరపాటుకు గురిచేసింది. అహ్మదాబాద్ నుంచి లండన్ వెళ్తున్న విమానం.. టేకాప్ అయిన కొన్ని సెకన్లకే కుప్పకూలిపోయింది.దీంతో విమానంలో ఉన్న 241 మందితో పాటు హాస్టల్‌లో ఉన్న మెడికోలు కలిసి 271 మంది చనిపోయారు. ఈ ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది.అయితే అహ్మదాబాద్ విమాన ప్రమాదం తర్వాత ఎయిరిండియా అంతర్జాతీయ సర్వీసులను నిలిపేసింది. చెకప్ కోసం ఈ నిర్ణయం తీసుకుంది. అయితే ఈ విమాన సర్వీసులను ఆగస్టు 1 నుంచి పునరుద్ధరిస్తున్నట్లు ఎయిరిండియా ప్రకటించింది. ఈ మేరకు ఎయిరిండియా అధికారిక ప్రకటనలో తెలిపింది. ఇక పూర్తి సర్వీసులు మాత్రం అక్టోబర్ 1, 2025 నుంచి పునరుద్ధరించబోతున్నట్లు పేర్కొంది. "జూలైతో పోలిస్తే ఆగస్టు 1 నుంచి కొన్ని ఫ్రీక్వెన్సీల పునరుద్ధరణ పాక్షిక పునఃప్రారంభం అవుతుందని.. 2025 అక్టోబర్ 1 నుంచి పూర్తి పునరుద్ధరణ జరుగుతుంది". అని ప్రకటనలో తెలిపింది.జూన్ 12న అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఎయిరిండియా విమానం లండన్‌కు బయల్దేరింది. టేకాఫ్



అయిన కొన్ని సెకన్లకే విమానం సమీపంలోని హాస్టల్‌పై కూలిపోయింది. ఒక్కరు మినహా 241 మంది చనిపోయారు. హాస్టల్‌లో మెడికోలు కూడా చనిపోయారు. ఇలా మొత్తం 271 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల కుటుంబాలకు ఎయిరిండియా రూ.కోటి పరిహారం అందించింది.

# స్థానిక ఎన్నికలకు అధికారులు సిద్ధం..ఖరరైన ఎంపిటిసి, జడ్పీటిసి స్థానాలు

హైదరాబాద్,ఉమ్మడి జిల్లాలు కనుమరుగు కావడంతో కొత్తా జిల్లాల ఆధారంగా జడ్‌పి ఎన్నికలు జరుగనున్నాయి. పరిషత్ ఎన్నికలే ముందు వస్తాయని అంటున్నారు. గత ఎన్నికలతో పోలిస్తే ఒక జిల్లా పరిషత్ స్థానం తగ్గిపోయింది. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని గ్రామాలు, మండలాలు సమీప మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో విలీనం కావడంతో 'స్థానిక' ఎన్నికల ప్రక్రియ నుంచి ఈ జిల్లా లేనట్లుగానే అయ్యింది. రాష్ట్రంలో 2019 ఎన్నికల నాటికి 32 జిల్లా పరిషత్‌లు ఉండగా.. తాజాగా 31 జెడ్.పీ.లకు మాత్రమే ఎన్నికలు జరగనున్నాయి. 2019లో రాష్ట్రవ్యాప్తంగా 539 ఎంపీపీలు, జెడ్పీటీసీలకు ఎన్నికలు జరిగినా.. ప్రస్తుతం వాటి సంఖ్య 566 స్థానాలకు చేరింది. అత్యధికంగా నల్గొండ జిల్లాలో 33 స్థానాలు, అత్యల్పంగా ములుగు జిల్లాలో 10 ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలున్నాయి. కాగా, ప్రభుత్వం నుంచి ఎప్పుడు ప్రకటన వచ్చినా.. స్థానిక ఎన్నికల నిర్వహణకు రెడీగా ఉన్నట్లు పంచాయితీరాజ్ అధికారులు పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణ క్షేత్రస్థాయిలో అన్ని ఏర్పాట్లు- చేస్తున్నట్లు తెలిపారు. ఇకపోతే రాష్ట్రంలో ఎంపీటీసీ స్థానాల లెక్క తేలింది. అంతకు ముందు 5,817 ఎంపీటీసీ స్థానాలు ఉండగా.. ప్రస్తుతం వాటి సంఖ్య 5,773కు తగ్గింది. గతం కంటే 44 ఎంపీటీసీ స్థానాలు తగ్గాయి. 566 ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 71 గ్రామ పంచాయతీలు జీహెచ్ఎంసీ, కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో కలవడంతో భారీగా మార్పులు చోటుచేసుకున్నాయి. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, రంగారెడ్డి, మేడ్చల్- మల్కాజ్‌గిరి జిల్లాల్లోని పంచాయతీలు మున్సిపాలిటీలలో విలీనం కావడంతో దీని ప్రభావం ఎంపీటీసీ స్థానాలపై పడింది. పంచాయతీ రాజ్‌శాఖ డీనోటిఫైడ్ చేసిన తర్వాత ఎంపీటీ- సీ స్థానాలు తగ్గినట్లు- అధికారులు పేర్కొన్నారు. కాగా, తాజాగా సంగారెడ్డి జిల్లాలో ఇంద్రేశం, జిన్నారం కొత్త మున్సిపాలిటీల ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ రెండింటి పరిధిలో దాదాపు 18 గ్రామ పంచాయతీల వరకు ఉంటాయి. అవి పూర్తిస్థాయిలో మున్సిపాలిటీలలో కలిస్తే ఇప్పుడున్న ఎంపీటీసీల సంఖ్యలో స్వల్ప మార్పులు చోటు-చేసుకోనున్నాయి. దీంతో రాష్ట్రంలో




మళ్లీ ఎంపీటీసీ స్థానాల సంఖ్య తగ్గే చాన్స్ ఉందని అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఈ 18 పంచాయతీల పునర్ వ్యవస్థీకరణ, మండల ప్రజా పరిషత్ డీలిమిటేషన్ కోసం షెడ్యూల్ జారీ చేయాల్సి ఉంటుంది. అప్పుడు పూర్తిస్థాయిలో ఎంపీటీసీ స్థానాలు ఖరారు కానున్నాయి. ఈ పంచాయతీలకు మున్సిపాలిటీలు నోటిఫై చేస్తూ గెజిట్ విడుదల చేయాలి. పంచాయతీ రాజ్ శాఖ వీటిని డీనోటిఫైడ్ చేయాలి. అయితే, ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేందుకు ఇరు శాఖల అధికారులు కసరత్తు ముమ్మరం చేశారు. ఇకపోతే రాష్ట్రంలో గ్రామ పంచాయతీలు, వార్డుల లెక్క తేలింది. 2019లో 12,769 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించగా.. వాటి సంఖ్య 12,759కి తగ్గింది. అయితే, ఇటీ-వల నల్గొండ జిల్లాలోని హాలియా మున్సిపాలిటీ పరిధిలోని ఒక పంచాయతీని డీనోటిఫైడ్ చేశారు. దీంతో పంచాయతీల సంఖ్యలో స్వల్ప మార్పులు జరిగాయి. సదరు గ్రామం పంచాయతీ రాజ్‌శాఖ పరిధిలోకి రానున్నది. పీఆర్ శాఖ ఈ పంచాయతీని నోటిఫై చేస్తే గ్రామ పంచాయతీల సంఖ్య 12,760కు చేరనున్నది. 2019లో గ్రామాల వార్డులు 1,13,136 ఉండగా.. పంచాయతీలు మున్సిపాలిటీ-లలో కలవడంతో వాటి సంఖ్య 1,12,500కు చేరింది.

# ఏపీ నుంచి రాజ్యసభకు మాజీ ప్రధాని...మాజీ సీఎం ?



అమరావతి,ఏపీ నుంచి రాజ్యసభకు మరో నాలుగు సీట్లు ఖాళీ అవుతాయి. అయితే దానికి మరో 11 నెలల సమయం ఉంది. 2026 జూన్ నెలలో ఏపీ నుంచి నాలుగు రాజ్యసభ ఎంపీ సీట్లు ఖాళీ అవుతాయి. వాటికి సంబంధించి నామినేట్ అయ్యేవారి పేర్లు ఇప్పటి నుంచే ప్రచారంలో ఉండడం విశేషం.బీజేపీ తనకు ఒక సీటు, తన మిత్రపక్షానికి ఒక సీటు ఏపీ కోటాలో కావాలని ముందే కర్చీఫ్ వేసిందని అంటున్నారు. పక్కన ఉన్న కర్ణాటకకు చెందిన సీనియర్ నేత జేడీఎస్ అధినేత మాజీ ప్రధాని అయిన దేవేగౌడ రాజ్యసభ సభ్యత్వం వచ్చే ఏడాదితో పూర్తి అవుతోంది. దాంతో ఆయనను ఏపీ కోటా నుంచి పంపించాలని బీజేపీ కేంద్ర నాయకత్వం భావిస్తోంది అని అంటున్నారు.కర్ణాటకలో జేడీఎస్ బీజేపీల మధ్య పొత్తు ఉంది. దాంతో 2024 లోక్ సభ ఎన్నికల్లో మంచి ఫలితాలను రెండు పార్టీలు సాధించాయి. ఇక దేవెగౌడ కుమారుడు, కర్ణాటక మాజీ సీఎం అయిన కుమారస్వామి కేంద్రంలో కీలకమైన ఉక్కు శాఖ మంత్రిగా ఉన్నారు.మరో వైపు చూస్తే దేవెగౌడ కుమారస్వామిలతో టీడీపీ అధినేత చంద్రబాబుకు మంచి సంబంధాలు ఉన్నాయి. దాంతో బీజేపీ ఈ ప్రతిపాదన తెస్తున్నట్లుగా అయితే ప్రచారం సాగుతోంది. దాంతో దేవెగౌడ సీటు కన్ఫర్మ్ అయ్యే చాన్స్ ఉందని అంటున్నారు.అంతే కాదు బీజేపీ కోటాలో మరో సీటు కోరుతున్నారని అంటున్నారు. ఆ సీటుని రాయలసీమకు చెందిన నాయకుడు ఉమ్మడి ఏపీకి చివరి ముఖ్యమంత్రిగా పనిచేసిన నల్లారి కిరణ్ కుమార్ రెడ్డికి ఇప్పించి ఆయనను పెద్దల సభకు తీసుకుని రావాలని బీజేపీ చూస్తోంది అని అంటున్నారు.ఇప్పటికే ఏపీ నుంచి నాలుగు రాజ్యసభ సీట్లు ఖాళీ అయితే అందులో రెండు ఆ పార్టీ తీసుకుంది. ఒకదానిని ఆర్ క్రిష్ణయ్యకు మరోదానిని పాకా సత్యనారాయణకు ఇచ్చారు. 2026లో ఖాళీ అయ్యే నాలుగింటిలో మళ్ళీ రెండు సీట్లు బీజేపీ కోరుతోంది అని అంటున్నారు.ఇక ఆ మిగిలిన రెండింటిలో టీడీపీ 2024లో రాజ్యసభకు పంపించిన పారిశ్రామికవేత్త సానా సతీష్ కే మరోసారి రెన్యూవల్ చేయవచ్చు అని అంటున్నారు. ఇక జనసేనకు ఈ తడవ ఒక సీటు కచ్చితంగా ఉంటుందని అంటున్నారు. ఆ సీటుని మరో పారిశ్రామికవేత్త లింగమనేని రమేష్ కి ఇస్తారని కూడా ప్రచారం సాగుతోంది.మొత్తానికి చూస్తే 2026 జూన్ లో ఖాళీ అయ్యే నాలుగు రాజ్యసభ సీట్లకు ఇప్పటి నుంచే అభ్యర్థులు ఖరారు అయిపోయారా అన్నదే చర్చగా ఉంది. ఇక వరసబెట్టి రాజ్యసభ సీట్లను ఏపీ నుంచి బీజేపీ తీసుకుంటే టీడీపీలోని ఆశావహులకు ఎలా అన్నది కూడా మరో వైపు చర్చగా ఉంటోంది. టీడీపీలో సీనియర్లు అనేకమంది రాజ్యసభ కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారని అంటున్నారు. ఈ పేర్లే కనుక ఫైనల్ అయితే మాత్రం వారంతా మరింత కాలం నిరీక్షణతో గడపాల్సిందే అని అంటున్నారు.

# రాజకీయ చదరంగంలో బీసీ పావులు

హైదరాబాద్, తెలంగాణలో హాట్ టాపిక్ గా మారిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలు ఆశగానేమిగిలిపోతుందా? మరోసారి బీసీల పాలిట త్రిశంకు స్వర్గంగా మారుతుందా? అనే అనుమానాలు చుట్టుముడుతున్నాయి. ప్రధాన రాజకీయ పక్షాల పాచికలో బీసీలు పావులుగా మారుతున్నారనే చర్చసాగుతోంది. అంగట్లో అన్నీ ఉన్నా%'ొ%అల్లుని నోట్లో శని ఉన్నట్లు కాంగ్రెస్,బీఆర్ఎస్, బీజేపీలతో పాటు ఇతర రాజకీయ పార్టీలు 42శాతం రిజర్వేషన్లకు గట్టి మద్ధతుదారులుగా బల్ల గుద్ది వాదిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండగా, బీఆర్ఎస్ ప్రధాన ప్రతిపక్షంగా ఉంది. బీజేపీ మూడవ పక్షంగా కొనసాగుతోంది. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండగా, ప్రధాన ప్రతిపక్షంగా కాంగ్రెస్ కొనసాగుతోంది. ఈ స్థితిలో రాష్ట్రంలో ఒకరు నిర్ణయం తీసుకుంటే కేంద్రం సహకరిస్తే కావాల్సిన కార్యక్రమం గంధర్వులు చేసినట్లు బీసీల స్థానిక రిజర్వేషన్లకు పెద్దగా అడ్డుపడే శక్తి ఎవరూ లేరు. కానీ, 42 శాతం రిజర్వేషన్ల అమలుపైన ఈ మూడు పార్టీల చిత్తశుద్ధిని కొందరు శంకిస్తున్నారు. మూడు పార్టీల్లో నిజాయితీ ఉంటే, పరస్పర సహకారం తీసుకుని బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసే రాజకీయ నిర్ణయంతో పాటు చట్టసభల్లో అడ్డంకులు, రాజ్యాంగపరమైన ఆటుపోట్లను సులభంగా తొలగించవచ్చు. కానీ, ఒకరిపై ఒకరు రాజకీయ విమర్శలు చేసుకుంటూ సమస్యను జఠిలం చేస్తున్నారు. దీనికి ప్రధాన కారణం మూడు రాజకీయ పక్షాల్లోని బీసీ నాయకులు సంఘటితంగా లేక పోవడం ఒక కారణమైతే, సమిష్టిగా తమ జాతి ప్రయోజనం కోసం పట్టుబిగించకపోవడం మరో కారణంగా చెప్పవచ్చు. ఈ పార్టీల్లోని బీసీ నేతల్లో నిర్ణయాధికార పాత్రలేకపోవడంగా భావిస్తున్నారు. ఇతరుల నాయకత్వంలో పనిచేసే ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులుగా ఉండడం మరో అంశంగా గుర్తుచేస్తున్నారు. ముఖ్యంగా బీసీ సమాజంలోని అనైక్యత, కొందరు సంఘనాయకుల భావదారిద్రానికి తోడు, స్వంత ప్రయోజనం కోసం అందరి ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టే స్వభావం వల్ల తీవ్రమైన ముప్పు నెలకొంటోంది. ముఖ్యంగా బీసీ సమాజం నుంచి రాజకీయ పక్షాలపై బలమైన ఒత్తిడి లేకపోవడం ప్రధాన కారణంగా పరిశీలకులు భావిస్తున్నారు.

హామీలు తప్ప అమలెక్కడ?

ఈ నేపథ్యంలోనే తెలంగాణంలో పంచాయతీ రాజ్ ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలిప్పుడు ఫలిస్తుందా? తీరా ఎన్నికలనాటికి రిక్త హస్తం చూపెట్టి పాత ధోరణిలోనే ఒక పార్టీ పై మరో పార్టీ విమర్శలు, ప్రతివిమర్శలు చేస్తూ తమ రాజకీయ పబ్బంగడుపుకుంటారా? అనే చర్చ తీవ్రంగా సాగుతోంది. ఎందుకంటే బీసీల పట్ల ఈ పార్టీలకు నిజాయితీ ఉంటే ఒకరు తీర్మానం చేస్తే మరొకరు సహకరించే పద్ధతిని అవలంభించి ఉమ్మడి రాజకీయ నిర్ణయంగా



చట్ట సభల్లో రూపం తీసుకునేందుకు అవకాశం ఉంటుందంటున్నారు. కానీ, ఇప్పటికే అధికార కాంగ్రెస్ పార్టీ కేబినేట్ నిర్ణయం తీసుకుంటే మిగిలిన పక్షాలు సన్నాయి నొక్కులు నొక్కుతున్నాయి. తమ నాయకత్వాల పై ఒత్తిడి తెచ్చి బీసీలకు చట్టబద్ధ అవకాశాలు కల్పించి ఆయా పార్టీల్లో బీసీ నాయకులుగా తమ గౌరవాన్ని, బీసీల గౌరవాన్ని కాపాడుదామనే సానుకూల దృక్పథం కంటే ఈ తంతును ఉపయోగించుకునే బీసీలను తమ ఓటు బ్యాంకుగా మార్చుకుంటూ ప్రత్యర్థిపార్టీని ఇరుకున పెట్టే ప్రయత్నాలు సాగుతున్నాయి. బీసీ సమూహం వీరికి కర్రుకాల్చివాత పెట్టాలని బీసీ సంఘాల నాయకులు కొందరు ఇప్పటికే విన్నవిస్తున్నారు.

మందెక్కువ మజ్జిగ పలుచన

తెలంగాణ సమాజంలో అధికారిక కుల గణన ప్రకారం 56.33 శాతంగా ఉన్న బీసీలు ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారు. ప్రధానంగా రాజకీయ రంగంలో బీసీల ప్రాధాన్యత అంతంత మాత్రమే. అది కూడా కొన్ని కులాలకే పరిమితమైంది. చట్టసభల్లో వీరి పాత్ర నామమాత్రంగా ఉండగా స్థానిక సంస్థల ఎన్నికల్లో అమలు చేస్తున్న కాసిన్నిరిజర్వేషన్ల పుణ్యమా అంటూ అక్కడక్కడ మెరుస్తుంటారు. ఎన్నికల ముందు అన్ని రాజకీయ పక్షాలు బీసీలను ఓటు బ్యాంకుగా భావించి వరాలు కురిపిస్తున్నారు. హామీలు అమలు దగ్గరికి వచ్చేసరికి అనేక అడ్డంకులు సృష్టించి మోకాలొడ్డుతున్నారు. దీనికి ముఖ్య కారణం బీసీల్లో అనైక్యత, చైతన్యరాహిత్యం ప్రధాన కారణం కాగా, బీసీ సంఘాలకు చెందిన కొందరు నేతలు సమూహ ఆత్మగౌరవాన్ని తమ స్వార్థప్రయోజనాలకు తాకట్టుపెట్టడం ప్రధాన కారణంగా భావిస్తున్నారు.

రాజకీయ పక్షాల ద్వంద నీతి

కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ లో బీసీలకు స్థానికసంస్థల ఎన్నికల్లో 42శాతం అమలు చేస్తామని ఇచ్చిన హామీ మేరకు కులగణన చేపట్టి జనాభా 56.33శాతంగా తేల్చింది. డెడికేషన్ కమిటీని కూడా ఏర్పాటు చేశారు.

Printed, Published & Owned by **MEDE SHANTHI KUMAR**, Printed at **SPOORTHI PRINTERS**, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001, Published From **SPOORTHI PUBLICATIONS**, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001 Editor: **MEDE SHANTHI KUMAR.**